ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 31, 2006

స్పేస్‌షటిల్... డిస్కవరీ

Wish you Happy New Year - 2007

పిల్లలు లేని దంపతులకు శుభవార్త !

* గర్భాశయ, అండాశయ, అండవాహికల్లో లోపాల నిర్ధారణ - చికిత్స
* పురుషుల్లో సంతానప్రాప్తి లోపాలు, వివిధ సమస్యల నిర్ధారణ - చికిత్స
* IUI (భర్త వీర్యం శుద్ధిచేసి గర్భసంచిలో ఇంజెక్షన్ ద్వారా పొందుపరచడం)
* IVF (శుద్ధిపరిచిన వీర్యకణాలు, అండాలు ల్యాబ్‌లో ఫలదీకరించడం)
* ICSI (మరీ తక్కువ వీర్యకణాలున్నప్పుడు అండంలోకి ఒకే వీర్యకణం మైక్రో ఇంజెక్షన్ ద్వారా చేర్చి ఫలితం సాధించడం)... వంటి

ఆధునిక వైద్య విధానాలతో.. మీ ఆకాంక్ష నెరవేర్చుకోవడానికి .... మీ కలల సాకారం చేసుకోవడానికి సంప్రదించండి.

SUCCESS

డా|| పద్మజ సంతాన సాఫల్య కేంద్రం

నవ్య నర్సింగ్ హోమ్ - భువనగిరి

MATERNITY - SURGICAL - FERTILITY

Phone : 08685 - 243123 / 243200. Cell : 99480-44665

డా|| పద్మజ, DGO
(A.R.T. Specialist)
సంతాన సాఫల్య నిపుణులు

హ్యాపీ బర్త్‌డే

(31.12.2006 నుంచి 6.1.2007వరకు)

జె. శిరీష కుమారి
3సం॥, డిసెంబర్-31
రాధ-శ్రీనివాస్
వెంకటాపురం-మ॥నగర్

ఎ. అనీష్
1సం॥, జనవరి-1
సదాలక్ష్మి-మధురాం
అంబర్‌పేట్-హైదరాబాద్

తేజ
2సం॥, జనవరి-1
సుజాత-సైదులు
కొండనాగుల-మ॥నగర్

ఎ. సాయి సింధూజ యాదవ్
3సం॥, జనవరి-1
సుశీల-రమణయ్య
అగ్రహారం-కడప

ఉజ్మషేక్
3సం॥, జనవరి-1
మేహ్రున్‌షేక్-మహ్మద్‌షేక్
కిషన్‌బాగ్-హైదరాబాద్

ఎ. జ్యోత్స్న
జనవరి-2
రజని-మురళి
తిరువూరు-కృష్ణా

శ్రావణ్‌కుమార్
2సం॥, జనవరి-4
సావిత్రి-వెంకటేష్
నిజామాబాద్

టి. అభినయ
జనవరి-4
కవిత-రాములుగౌడ్
చౌటుప్పల్-నల్లగొండ

యం. నందకిశోర్
10సం॥, డిసెంబర్-31
మంజుల-దశరథ
శంకర్‌పల్లి-రంగారెడ్డి

వి. సుమన్
లక్ష్మీ సరస్వతి-శశికుమార్
కాకినాడ-తూ॥గో॥

పి. భవాని
3సం॥, జనవరి-1
అన్నపూర్ణ-శ్రీనివాసరావు
వేమవరం-ప్రకాశం

వి.సింధు
4సం॥, జనవరి-5
రమాదేవి-రవికుమార్
రాజమండ్రి

పాజిటివ్‌గా ఆలోచించడం నేర్చుకోవాలి

మన అతిథి గురించి...

పేరు	:	డాక్టర్ కె. రాజలింగం
జన్మదినం	:	02.02.1953
జన్మస్థలం	:	అనంతపురం
ప్రస్తుత హోదా	:	వైస్ ఛాన్సలర్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు)
విద్య	:	బి.టెక్, ఎం.టెక్ (జెఎన్‌టియు), పిహెచ్‌డి (ఐఐటి, మద్రాస్)
లక్ష్యం	:	ఇతరులకు సాధ్యమైనంత వరకు సహాయం చేయాలని.
హాబీలు	:	షటిల్ ఆడటం, మ్యాగజైన్లు చదవడం, పాటలు వినడం
బలం	:	ఆత్మవిశ్వాసం
బలహీనత	:	జాలిగుణం ఎక్కువగా ఉండడం
ఆదర్శం	:	ప్రొఫెసర్ వి. గణేశన్
నచ్చిన అంశం	:	విద్యార్థులతో చర్చించడం

సమాజం, వ్యక్తి అభివృద్ధికి దోహదం చేసే అతి ముఖ్యమైన నైతిక విలువలను మనం మిస్ అవుతున్నాం. వీటిని చిన్నప్పటి నుంచి బోధించాల్సిన అవసరం ఉంది. అంటే స్కూల్లో టీచర్లు, ఇంట్లో తల్లిదండ్రులు నేర్పాలి. వీలైనంత వరకు ఇతరులకు ఇబ్బంది కలిగించే పనులు చెయ్యకూడదు. యువత పాజిటివ్‌గా ఆలోచించడం నేర్చుకోవాలి. కష్టపడి చదవడం, పనిచేయడం వల్ల యువత మంచి ఫలితాలు సాధిస్తుంది.

ఈ సంచికలో...

టపా ... 2

మనమూ మన నమ్మకాలు ... 4

సలహాలు ... 5

ఇంటి సంగతులు ... 6

క్యాంపస్ ఛాట్ 10

సినిమా కబుర్లు ... 11

బాలనేస్తాలు ... 12

అట్టమీది కథ ... 14

ఇంకా...

ఇలా వుందామా... 7

మొహమాటం



సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

ప్రేమ

అవీ...ఇవీ ... 20

చల్తే... చల్తే ... 21

మనసా... తెలుసా ... 22

విజ్ఞానవీచిక ... 23

కొత్త పుస్తకాలు ... 24



ఆర్‌టిసి పరుగులు

17-12-2006 నాటి అట్టమీది కథలో ఆర్టీసీ స్వరూపాన్ని సంపూర్ణంగా వివరించింది. 'ఆరోగ్యం' ద్వారా అందించిన సూచనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. 'విజ్ఞానవీచిక' కొత్తసంగతులను తెలియజేసింది. రోబోలవల్ల నవ్వడం సాధ్యం కాదని అన్యాపదేశంగా తెలుసుకున్నాం. ఎంజాయ్‌మెంట్ ఉండాలి కానీ హద్దుమీరకూడదు అంటూ 'క్యాంపస్‌ఛాట్'లో చెప్పిన విషయాలు అనుసరణీయమైనవి. హక్కులు నిలబెట్టుకునే చైతన్యం స్త్రీలలో ఉన్నప్పుడే మహిళాభ్యుదయం సాధ్యమౌతుందనే దానిలో ఎంతో వాస్తవముంది. శకుంతలగారి మాటలో ఎంతో జీవితం కనబడుతోంది. తెలుగు చలనచిత్రరంగానికి లభించిన గయ్యాళిపాత్రలలో బాగా రాణించే నటి శకుంతలగారనే చెప్పొచ్చు. 'కొత్త పుస్తకాలు'ద్వారా పరిచయం చేస్తున్న పుస్తకాలు బావుంటున్నాయి. 'అవి ఇవి' అలరిస్తోంది.

- ఎన్ సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

స్ఫూర్తిదాయకం

'సినిమాకబుర్లు' శీర్షికలో తెలంగాణా శకుంతల గారి ముచ్చట్లు ఆసక్తిగా చదివాం. మళ్లీజన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలని ఆవిడ కోరుకోవడం నిజంగా స్ఫూర్తిదాయకం. 'తెలుగుగడ్డ' సీరియల్ ఆసక్తికరంగా ఉంది. సిపాయిలను ప్రతాప్ రక్షించడం మానవతను చాటిచెప్పింది. జానకయ్య, పటేళ్ళ సంభాషణ నవ్వుతెప్పించింది.

- నీరజ, రజని, అనంతపురం

ఉపయోగకరం

వైరుధ్యం కథ బాగుంది. ప్రపంచీకరణ పరిణామాలను చక్కగా వివరించారు. కార్టూన్లు బాగా నవ్వించాయి. 'బాలనేస్తాలు'శీర్షికలోని చిత్రం-విచిత్రంలో 'పక్షులతో పాప' మాకు చాలా బాగా నచ్చింది. 'ఆరోగ్యం' శీర్షికలో అతిమూత్రవ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలులో వ్యాయామాలగురించి ఇవ్వడం ఉపయోగకరంగా ఉంది.

- శ్రీధర్, కాకినాడ

ఉత్సవాలకు సార్థకత

ఈ వారం స్నేహ మా ఇంటిల్లిపాదినీ అలరించింది. మినీకవితలకు ప్రవేశం కల్పించండి. పాఠకులు పాల్గొనే మరికొన్ని కొత్త శీర్షికలుంటేనే బాగుంటుంది. 'ఇలా ఉందామా'లో వివరించిన విషయాలు ఆసక్తికరంగా, మనోహరంగా ఉన్నాయి. తిరుపతిలో జరిగిన సాహితీసంస్కృతి ఉత్సవాలకు వచ్చిన జనప్రవాహాన్ని గమనిస్తే సాహిత్యం సంస్కృతి పట్ల ఉన్న అభిమానం హర్షణీయం, ఆదర్శం. ఇది ఊహించని మంచి పరిణామం! అన్ని వృత్తులు ప్రవృత్తుల వాళ్లూ విచ్చేయడం ఆశ్చర్యానందాలు కలిగించే విషయం.

- కలువకోట మురళీధరస్వామి, కరీంనగర్,

సమంజసమేనా?

అట్టమీదికథ ఆర్టీసీ పరుగులో డైమండ్‌జూబ్లీలో ఎపిఎస్ఆర్‌టిసి గురించి చక్కగా వివరించారు. 75వసంతాలు పూర్తిచేసుకున్న ఆర్‌టిసి గిన్నిస్‌బుక్‌లో చోటుచేసుకుని, తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకుంది. ముఖ్యంగా ఇంధన ఆదాలో అన్ని రాష్ట్రాలకంటే ఎపిఎస్ఆర్‌టిసినే ఒకడుగు ముందుండడం గర్వకారణం. ఎన్నో ఒడుదుడుకులలో ఓలలాడుతున్న ఆర్టీసీని లాభాలబాటలో పయనించేట్లు చేస్తున్న కార్మికసోదరుల శ్రమను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరికీ వుంది. బ్యాంకు నిబంధనల ప్రకారం ఆర్టీసి ప్రైవేట్‌పరం అవటం తథ్యం. 2007నాటికి ఆర్‌టిసిని ఎత్తివేయాలని అది యోచిస్తోంది. క్రమక్రమంగా ఒక్కో బస్‌డిపోను ఎత్తివేస్తూ, కార్మికుల పొట్టలు కొట్టడం సమంజసమేనా? కాబట్టి ఆర్‌టిసి కార్మికులంతా ఒకే తాటిపై నిలబడి ఏకపక్షనిర్ణయంతో ప్రభుత్వవిధానాలను ప్రతిఘటించాలి. ఆర్టీసిని ప్రగతిబాటలో పయనింపచేస్తారని ఆశిద్దాం. ప్రమాదాలను అరికట్టడానికి, నష్టాలను అధిగమించడానికి సుశిక్షితులైన వాహనచోదకులను నియమించాలి. ప్రయాణీకులకు మరిన్ని సదుపాయాలు కలిగించాలి. ఫలితం... ఆర్‌టిసి ఆఘమేఘాలమీద పరుగిడగలదు. అలాగే డ్రైవర్లకు, కండక్టర్లకు తగిన సూచనలిస్తే ఆర్‌టిసి ఆదాయం ఇంకా పెరుగుతుంది. ఏదేమైనా ప్రయివేట్ పరంకానున్న ఆర్టీసిని గట్టెక్కించాలంటే మనమందరం ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణం చేద్దాం. ప్రమాదాలను కొనితెచ్చే ప్రైవేటు' వాహనాలను త్యజిద్దాం. తద్వారా ఆర్టీసీ కార్మికులకు మనం పరోక్షంగా ఉద్యోగ భద్రతను కల్పించినవారమవుదాం.

ఇహపోతే ప్రతీవిషయాన్ని డబ్బుతో ముడిపెట్టి తక్కువకాలంలో ఎక్కువగా సంపాదించాలన్న దురాశ యువతీయువకులు అందర్లోనూ ఉంది. అలాగాక స్త్రీలు తమ హక్కులను నిలబెట్టుకునే చైతన్యం కలిగి ఉన్నప్పుడే మహిళాభ్యుదయం సాధ్యమని, 'స్త్రీలు చైతన్యవంతం కావాలి' అంటూ వసంతకన్నాభిరాన్ చాలా చక్కగా వివరించారు.

- సారెడ్డి రామచంద్రారెడ్డి, యాడికి, అనంతపురం

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్



టెక్నాలజీ సహాయంతో

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ. 150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని. నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జి. శ్రీనివాసులు, తిరుపతి.

3914

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road,
(Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name:..

Address:..

....

....

....

.......................Pincode

మనమూ-మన నమ్మకాలు

పి. జ్యోతి

తిరుగుటపా

'పుంఖానుపుంఖాలుగా పత్రికలకు పంపిన వాటిలో ఓ నాలుగు రచనలే అచ్చయ్యాయి. మిగతావన్నీ తిరుగుటపాలో వెనక్కివచ్చినవే. ఆ నాలుగూ ఎందుకు అచ్చయ్యాయి? మిగతావి తిరిగిరావడానికి కారణమేంటి?' అని తీవ్రంగా ఆలోచించసాగింది రచయిత్రి రాంబాయమ్మ. చాలాసేపటికి ఆవిడకు ఒక విషయం తెలిసింది. అదేంటంటే... అచ్చయిన నాలుగు రచనలూ 'ర' అన్న అక్షరంతో మొదలయినవి కావడం. అంటే తనకు 'ర' అన్న అక్షరం అయితే బాగా కలిసొస్తుందన్నమాట అని ఒక నిర్ణయానికొచ్చేసింది రాంబాయమ్మ. ఇక... అలా అనుకున్నప్పటినుండీ రచనలన్నీ 'ర' అక్షరంతోనే మొదలుపెట్టడం ప్రారంభించింది.

ఓసారి ఓ ప్రముఖ పత్రికవారు కథలపోటీ నిర్వహించారు. ఈసారి ఎలాగైనా పోటీల్లో పాల్గొని ప్రథమబహుమతి సొంతం చేసుకోవాలని తీర్మానించుకుంది రాంబాయమ్మ. తన సెంటిమెంట్ ప్రకారం కథను 'ర' అన్న అక్షరంతోనే మొదలుపెట్టాలి. రాత్రీపగలూ ఆలోచించినా తగిన అంశం దొరకడం లేదు. ఎలాగని తలబద్దలు కొట్టుకున్నా పాయింట్ లభించలేదు. పైగా తలనొప్పి మొదలయింది. అమృతాంజన్ తలకు రుద్దీరుద్దీ బాటిల్ అయితే ఖాళీ అయిపోయిందిగానీ తలనొప్పిమాత్రం తగ్గలేదు.

ఇంతలో రామలక్ష్మమ్మ రేడియో ఆన్ చేసింది. ఆవిడ రాంబాయమ్మకు మేనత్త. 'ర' అక్షరంతో ఎలా మొదలుపెట్టాలాని సీరియస్‌గా ఆలోచిస్తున్న రాంబాయమ్మకు, మేనత్త రేడియో పెట్టడంతో మహాచిరాకు పుట్టింది. అందుకే చేతిలోని పెన్నును విసిరిపారేసింది. కాసేపలా కళ్లుమూసుకుని కూర్చుండిపోయింది.

ఇంతలో రేడియోలోంచి "మీ మాటతో ఓ పాట..." కార్యక్రమం ప్రారంభమైంది.

అంతలో ఫోన్ రింగయింది.

"హలో! ఎవరండీ? ఇది మీ మాటతో ఓ పాట ప్రోగ్రాం అండీ" అంటూ ఒక మగగొంతు వినబడింది.

"ఆ! నేను రావులపాలెం నుండి రాధారాణిని మాట్లాడుతున్నానండీ" అంటూ మరోవేపునుండి ఆడగొంతు వినబడింది.

"హల్లో! రాధారాణిగారూ! బావున్నారా, ఏంటి ఈమధ్య మీరు చాలా రోజుల్నుండి మాకు ఫోన్ చేయడం లేదు?"

"అబ్బో! లెక్కలేనన్నిసార్లు ట్రైచేశానండీ, అసలు లైను కలవడం లేదు. లక్కీగా ఈరోజున కలిసిందండీ" ఆనందంగా అంది ఆడగొంతు.

"అవునాండీ! అయితే మీరదృష్టవంతులండీ. సరే, మీకు ఏ చిత్రంలోని పాట కావాలో కొంచెం చెబుతారా"

"ఊ... మిస్సమ్మ సిన్మాలోని, రావోయి చందమామ... మా వింతగాధ వినుమా...." అని కొంచెం పాడి వినిపించింది.

"బావుందండీ! మీరు పాతపాటలను బాగా లైక్ చేస్తారా?" అడిగాడతను.

"అబ్బే! లేదండీ! నేను చాలా మోడ్రన్! ఈ పాట మా అమ్మమ్మ అమృతవల్లిగారి కోరిక మేరకు అడిగానండీ"

"అవునాండీ! అయితే మరి మీ అమ్మమ్మగారి కోరికమేరకు ఆవిడ కోరిన పాటను ఇప్పుడు మేం ప్రసారం చేస్తున్నాం. విని ఆనందించండి"

"ఓకే థాంక్సండీ"

ఇంతలో రేడియోలో "రావోయి చందమామ" అన్న పాట రావడం మొదలయింది. రాంబాయమ్మకు తను ఎంతసేపటినుంచో ఎదురుచూస్తున్న అంశం దొరికినట్టయింది. ఇదే పాటతో తన రచనను ప్రారంభించింది. రాయడం మొదలుపెట్టింది. అరగంటలోనే పూర్తిచేసింది. 'హమ్మయ్య!' అనుకుని కథను కవర్‌లో పెట్టి అడ్రస్ రాసి తిరుగు కవర్ జతచేసి మరీ పంపించింది.

కొద్దిరోజులకు... తను పోటీకి పంపిన కథ తిరుగుటపాలో వచ్చింది. దాంతోపాటు ఓ ఉత్తరాన్నీ పంపాడు ఆ పత్రిక ఎడిటర్...

"రచయిత్రి రాంబాయమ్మగారికి,

మీరు కథ చాలా బాగా రాశారు. కాకపోతే మొదట 'రావోయి చందమామ' అన్న పాటతో ఎందుకు మొదలుపెట్టారో అర్థంకాలేదు. అది కథకు అసందర్భంగా తోచింది. లేదంటే మీ కథకు ప్రథమ బహుమతి వచ్చేది. అది రాయడంతో మీరు ఆ బహుమతిని అందుకునే అవకాశాన్ని కోల్పోయారు" అని ఉత్తరం సారాంశం.

"తన కథలు ప్రచురణ అవడానికి కారణం తను బాగా రాయడమేననీ, 'ర' అక్షరంతో మొదలు పెట్టడంవల్ల కాదనీ తన కథ తిరిగి రావడంవల్ల రాంబాయమ్మకు జ్ఞానోదయమైంది.

అది కోర్టు ధిక్కారమే...

సార్! మాది శ్రీకాకుళం జిల్లా బాలేరు గ్రామం. నేను మా గ్రామంలో ఇడిడిఎగా పనిచేశాను. మా పోస్టాఫీసులో మేం ముగ్గురం స్టాఫ్. ఒకరు బిపిఎం, ఇంకొకరు ఇడిడిఎ, మరొకరు ఇడిఎమ్‌సి/డిఎ. ఒకే కేటగిరికి చెందిన వారం ఇద్దరమున్నాం. వారిలో నేను అనగా ఇడిడిఎ సీనియర్. అయితే ప్రభుత్వంవారు మా ఇద్దరిపోస్టులలో ఒక పోస్టు రద్దు చేశారు. ఆ సందర్భంలో సీనియర్, జూనియర్ అని గుర్తించలేదు. సీనియర్‌ను వేరేచోటకు పంపించారు. ఫలితంగా సీనియర్‌కు జీతభత్యం తగ్గిపోయింది. సీనియర్ పొందవలసిన బెనిఫిట్ జూనియర్ పొందుతున్నాడు. ఈ విషయమై కొంతమంది సలహా తీసుకుని హైకోర్టుకు వెళ్ళాం. మూడు నెలల లోపు సీనియర్ స్థానం సీనియర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయవలసిందిగా కోర్టు తీర్పిచ్చింది. అలాగే నా జీతభత్యాలను సరిచేసింది. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ పంపిస్తారు కదా అని ఊరుకుండిపోయాను. మూడునెలల తరువాత ప్రభుత్వంవారు మరల నా జీతభత్యలను తగ్గించారు. జూనియర్ స్థానంలోనే నన్నుంచారు. తెలిసిన వారివద్దకెళ్ళి హైకోర్టు తీర్పు చూపించాను. 'మూడు నెలల దాటిపోయింది కాబట్టి మళ్లీ కోర్టుకు అప్పీలు చేసుకోవాలి' అని చెబుతున్నారు. నాకు వచ్చే జీతం తక్కువ. సీనియర్‌గా ఉండి జూనియర్ కన్నా జీతం తక్కువ తీసుకుంటున్నాను. మానసికంగా కుంగిపోతున్నాను. నాకు తగిన సలహా ఇవ్వగలరు.

- ఎల్. నీలకంఠరావు, శ్రీకాకుళం జిల్లా

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది **శ్రీ జి.ఎల్.నరసింహారావు** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా:
ప్రజాశక్తి ఆదివారం అనుబంధం,
ప్లాట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది
9848994240

హైకోర్టిచ్చిన తీర్పును డిపార్ట్‌మెంట్ వారు మూడు నెలలలో అమలు చేయాలి. లేకపోతే మీరు వారిపై కోర్టు ధిక్కారపు కేసు వేయవలసి ఉంటుంది. కోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వం కొద్ది రోజులపాటు మీకు సీనియర్‌కు వచ్చేంత జీతమే ఇచ్చి, మరల తగ్గించిందని మీరు చెబుతున్నారు. అది తప్పక కోర్టుధిక్కార నేరమవుతుంది. మీరు కంటెమ్ట్ నోటీసు ఇచ్చి, కేసు వేయవలసి ఉంటుంది. మీకు న్యాయం జరుగుతుంది.

ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

సంస్కారం

బాలామణికి కొడుకు పుట్టాడు. వాడిపేరు సుందర్. ఆ కుర్రాణ్ణి పెంచటంలో ఆమె తీసుకునే జాగ్రత్తలు చెప్పాలంటే సమయం చాలదు. ప్రపంచంలో ఎవరూ పెంచలేనంత శ్రద్ధగా, గొప్పగా, ఆదర్శంగా తన కొడుకును పెంచాలని ఆమె ఉద్దేశం. ఇక్కడ ఆదర్శం అంటే తమ స్థాయికి తగ్గకుండా అని అర్థం.

సుందర్‌కు ఏడాది నిండింది. పక్కపిల్లలతో ఆడుకునే అవకాశం పొందాడు. దానికి బాలామణి చాలా జాగ్రత్తలు తీసుకుంది. 'పిల్లలు తమ ఫ్లాట్‌లోకి వచ్చి ఆడుకోవాలి. ఎందుకంటే సుందర్ అందరికంటే చిన్నవాడు' ఇది బాలామణి వాదన. న్యాయబద్ధమే. పక్కవాళ్లు ఆనందంగా వాళ్ల పిల్లల్ని ఆమె ఇంటికి పంపించడం మొదలుపెట్టారు.

అపార్ట్‌మెంట్‌లో ఉన్న అందరి వివరాలూ రహస్యంగా సేకరించింది బాలామణి. ఆ పిల్లల తల్లిదండ్రులెవరు? వారెలాంటి వారు? వారి స్వభావమెలాంటిది? వారి చదువుసంధ్యలు, సంస్కారం, సంప్రదాయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తూనే ఉందామె. ఎవరిదేకులం, ఏ మతం, ఏ వర్గం, ఏ జాతి, ఎంత ఆస్తి ఉంది, ఆస్తి కాకపోతే ఎంతడబ్బు ఉండి ఉంటుంది, తండ్రి ఎలాంటి ఉద్యోగం చేస్తాడు, ఒకవేళ తల్లి ఉద్యోగానికి వెళ్తే అదెలాంటి ఉద్యోగం, తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగానికి వెళ్తే పిల్లల్ని ఎవరు చూస్తారు, వాళ్లెలా ఉంటారు... ఇవన్నీ ఆమె ఆరా తీస్తూనే ఉంటుంది. డబ్బున్న పెద్దకులం వాళ్లతో పిల్లాడు సహవాసం చేయాలని ఆమె కోరిక.

ఇలాంటి విషయాలు రాబట్టడానికి, వాచ్‌మన్, అతని భార్య ఆమెకు మంచి సోర్స్‌పర్సన్స్ అయ్యారు. ముఖ్యంగా వాచ్‌మన్ భార్య సుశీల బాలామణికి అన్ని వివరాలూ అందిస్తుండేది. ఆమె ఇచ్చే చిన్నచిన్న వస్తువులు, పచ్చళ్ళు, ఫలహారాలకూ ముచ్చటపడేది. ఇదో ఘనకార్యంగా భావించి మరింత ఉత్సాహంగా అందరి సంగతులూ సేకరించడం, ఆఘమేఘాలమీద ఆ సమాచారాన్ని బాలామణికి అందించి మురిసిపోతోంది. సుశీల కొడుకు ఏణ్ణర్థం వయసువాడు. మొదట్లో వాణ్ణి తన పిల్లాడితో ఆడుకోవడానికి రానిచ్చేది బాలామణి.

రోజులు గడిచేకొద్దీ బాలామణి ఒక నిర్ణయానికొచ్చింది. తమ కులం పిల్లలతో, తమ స్థాయికి తగ్గ పిల్లలతో మాత్రమే ఆడుకోనిస్తే పిల్లాడికన్నీ మంచి మాటలు, మంచి గుణాలు వస్తాయని ఆమె అభిప్రాయం. అందుకే పనిమనిషి కొడుకు, సుశీలకొడుకుల నుండి తన కొడుకును తప్పించింది. అంటే వాళ్లు వచ్చిన వెంటనే 'ఇంటికెళ్లి ఆడుకోండి' అంటూ పంపేసేది బాలామణి.

పెద్దకులంవాళ్ళంతా చాలా తెలివైనవాళ్లనీ, వాళ్లు స్వచ్ఛంగా మాట్లాడతారనీ, వాళ్ల అలవాట్లు ఉత్తమంగా ఉంటాయనీ, వాళ్లు శుచీశుభ్రం కలిగి ఉంటారనీ ఆమె నమ్మకం. అందుకే తన కొడుకు పై స్థాయివాళ్లతోనే మసలుకోవాలనుకునేది. కానీ సమాజంలో నేరుగా ఆ విషయం చెప్పడం కష్టం కనుక ఏదో విధంగా మసిబూసి మారేడు కాయచేసి, తను అనుకున్నట్లుగా చేస్తూ ఉండేది. తనెంతో తెలివిగా, ఎవ్వరికీ అర్థంకాకుండా చేస్తున్నందుకు మురిసిపోయేది. అయితే ఎదుటి వ్యక్తులభావాలు తమ తెలివితేటలతో అర్థం చేసుకునే శక్తి చాలామందికి ఉంటుంది. దానికి చదువుతో పెద్దగా సంబంధం ఉండదు.

'కొడుకు బాలామణి ఇంట్లో ఆడుకుంటున్నాడు' అనుకుంటూ నిశ్చింతగా బియ్యం షాపుకెళ్లింది సుశీల. బాలామణి వాడి చేతిలో ఒక బిస్కట్‌పెట్టి ఇంటికి తోలేసింది. వాచ్‌మన్ కొడుకులాంటి తక్కువ క్లాసువాళ్లతో తనకొడుకును ఆడుకోనివ్వకూడదని బాలామణి అనుకోవడమే దీనికి కారణం. తల్లి ఇంట్లో లేకపోవడం, తండ్రి పనిమీద పోవడంతో వాడు ఏడుస్తూ గుమ్మం దగ్గర కూర్చున్నాడు. పక్కనున్న మరొకామె వాడిని ఊరుకోబెట్టి అవీఇవీ పెట్టి మరిపించింది.

గంట తర్వాత వచ్చిన సుశీల విషయం త్వరగానే అర్థంచేసుకుంది. బాలామణి ఫ్లాట్‌లో పెద్దపెద్ద వాళ్లపిల్లలు కేరింతలు కొడుతూ, ఆడుకోవడం చూసింది. ఆమెకు ఎక్కడలేని కోపమూ వచ్చింది. అవమానంతో మనసు కుతకుతలాడిపోయింది. ప్రతీకారంతో రగిలిపోయింది.

అందరిళ్లకూ వెళ్లి వాళ్ల పిల్లల్ని బాలామణి ఇంటికి పంపవద్దనీ, ఆమె పిల్లల్ని విసుక్కుంటుందనీ, చీదరించుకుంటుందనీ చెప్పింది.

“నా పిల్లాణ్ణి అందుకే పంపటంలేదు. మేం డబ్బులేనివాళ్లం కావచ్చు. మీరు పెద్దకులపోళ్లు కావచ్చు. కానీ మా అభిమానం మాకుంటుందికదమ్మా” అంది.

అందరూ “అవును నిజమే! పిల్లలకివన్నీ అంటకూడదు. వాళ్లు దేవుడితో సమానం” అంటూ వాళ్లు సుశీలనే సమర్థించారు. పిల్లల్ని పంపటం మానేశారు.

వారం తిరిగేసరికి ఆడుకునేందుకు ఇతర పిల్లలు రాక, పెంకితనం చేస్తున్న కొడుకును ఓదార్చలేక వెర్రిమోహమేసింది బాలామణి.

ఇలా వుందేమో...

మొలకలపల్లి కోటేశ్వరరావు

మొహమాటం

వినీల మా ఎదురింటి అమ్మాయి. బిఎస్సీ పూర్తిచేసి, ఖాళీగా వుంది. బుద్ధిమంతురాలేకాదు పనిమంతురాలు కూడా! ఆమె తల్లిదండ్రులు పెళ్లిప్రయత్నాల్లో పడ్డారు. స్థితిమంతులే కాబట్టి పది లక్షల డబ్బు, కొంత బంగారం, పొలము ఇవ్వడానికి సిద్ధంగా వున్నారు. దాదాపు రెండేళ్లు గడిచినా సరైన సంబంధం దొరకలేదు. ఇంతలో వినీలవాళ్ల మావయ్య వచ్చాడు. ఆయన చిలకలూరిపేటలో పత్తి బిజినెస్ చేస్తుంటాడు. బాగా సంపాదించాడు.

"వినీలకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారటగా... బయటి సంబంధాలు ఎందుకమ్మాయ్? మన కిషోర్ లేడూ?!" అన్నాడు ఆయన చెల్లెలితో.

అన్నతో సంబంధం కలుపుకోవాలని ఆ చెల్లెలికీ ఉబలాటంగా వుంది. వినీలకి ఏమాత్రమూ ఇష్టం లేదు. ఆ మేనమామ కొడుక్కి లేని అలవాటు లేదు. 17, 18 ఏళ్ళ వయసులోనే తాగడం నేర్చుకున్నాడు. పేకాట సరేసరి. వేశ్యాలోలుడు. ఒకటేంటి, అతను సమస్త దుర్గుణాల సంపన్నుడు. మేనమామ డబ్బు సంపాదించడం మినహా, ఇంకేమీ పట్టించుకోడు.

మేనమామ బయటికెళ్లిన తరువాత వినీలను వాళ్లమ్మ ''అవమ్మాయ్ వినీలా... బావను చేసుకొమ్మని అడగడానికి వచ్చాడే మామయ్య. వాళ్లకు లక్షలకొద్దీ ఆస్తి వుంది. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు... ఏమంటావ్?" అంది.

"వద్దమ్మా... నేను తనను చేసుకోను"

"అబ్బాయికేం... ?"

"పచ్చి తాగుబోతోడు. వాణ్ణి చేసుకుని, జీవితాంతం ఎక్కడ చచ్చేది? పెళ్లి లేకపోయినా పర్లేదు కానీ...."

"అదికాదే... తెలియని సంబంధం చేసుకుంటామనుకో... అతను తాగడని నమ్మకం వుందా? కాబట్టి కిషోర్‌ను చేసుకుంటేనే మంచిదని నా వుద్దేశం!"

"ఈ విషయమై ఇక నువ్వు మాట్లాడకపోవడం మంచిది. ఈ ప్రస్తావన ఇంకెప్పుడూ తీసుకురావద్దు" అని గట్టిగా చెప్పింది వినీల.

తర్వాత అన్నాచెల్లీ ఏం మాట్లాడుకున్నారోగానీ మేనమామ వినీలను పిలిచి "ఏమ్మా, వినీలా... కిషోర్‌ని చేసుకో. తెలిసీ తెలియని వయసులో ఏదో పిల్లతనంగా ఉన్నా వాడిది మంచి బుద్ధి. నిన్ను బ్రహ్మాండంగా చూసుకుంటాడు. నువ్వు సుఖపడతావు" అన్నాడు.

వినీల ఆయన మాటలకెదురు చెప్పలేకపోయింది. మోహమాటమో, ఏమైనా అనుకుంటాడని సంకోచమో మొత్తానికి ఎదురుమాట్లాడలేదు. 'నేను చేసుకోన'ని వినీల అంటే ఆయన గట్టిగా అడగదల్చుకోలేదు. కానీ వినీల మౌనాన్ని ఆశ్రయించింది. దాన్నే అంగీకారంగా భావించి, చకచకా రాయబారాలూ బేరాలూ మొదలెట్టేశారు.

ఒక అశుభ ముహూర్తంలో వినీల, కిషోర్ ఒక ఇంటివారయ్యారు. పెళ్లయినా కిషోర్‌లో ఏ మార్పూ లేదు. తాగుడూ వేశ్యాలోలత్వం ఏమీ తగ్గలేదు. మూడునాలుగేళ్లకే తన దురవాట్ల కారణంగా ఎయిడ్స్ బారినపడ్డాడు. ఆ జబ్బును వినీలకూ అంటించాడు. పాతికేళ్లు నిండకుండానే భార్యాభర్తలిద్దరూ ఈ లోకాన్ని వదిలిపెట్టారు.

అతన్ని చేసుకోవాలన్న ఆసక్తి, అభిమానం, కోరిక, ప్రేమలాంటివి వినీలకు లేవు. చేసుకోకూడదనే అనుకుంది. అదే విషయాన్ని నిర్మొహమాటంగా మేనమామకు చెబితే, పరిస్థితి పెళ్లి వరకూ వెళ్లేదీకాదు, వినీల జీవితం అర్ధాంతరంగా ముగిసేదీ కాదు.

❄ ❄ ❄

సులోచన, సుగుణ ఇద్దరూ ఇరుగుపొరుగువాళ్లు. సులోచన సంపన్నురాలు. సుగుణ దిగువ మధ్యతరగతి. సుగుణ తమ్ముడి పెళ్లి. బోసి మెడ, చేతులతో పెళ్లికి వెళ్లడానికి సుగుణ మనసు అంగీకరించలేదు. సులోచనని గాజులు, నెక్లెస్ అడిగింది. ఇద్దరి మధ్యా ఉన్న స్నేహం వల్ల కాదని గట్టిగా చెప్పలేకపోయింది సులోచన. ఇచ్చిన తరువాత ప్రశాంతతను కోల్పోయింది.

పెళ్లిపనుల్లో ఉన్న సుగుణ ఆ బంగారం ఎక్కడో పెట్టడం, ఎవరో జేబులో వేసుకోవడం, సుగుణ లబోదిబోమని ఏడవడం... ఇక సులోచన బాధ చెప్పనలవి కాదు. ఆమెకు రెండు బాధలు! బంగారం పోయిన బాధ! భర్తతో తిట్లు తినాల్సిన బాధ!! ఈ స్థితికంతటికీ కారణం మొహమాటమే మరి!!!

❄ ❄ ❄

మొహమాటపడాల్సిన సందర్భాలు మనకు నిత్యజీవితంలో చాలా ఎదురవుతూ ఉంటాయి. ఎవరైనా ఇబ్బందుల్లోనో, ఆపదల్లోనో వుంటే తప్పక సాయం చేయాలి. ఇవ్వడంలో ఉన్న హాయీ, ఆనందమూ ఎందులోనూ ఉండవు. అయితే మంచీచెడూ ఆలోచించుకోవాలి. తమ స్వార్థంకోసం మనల్ని వినియోగించుకోవాలని చాలామంది ప్రయత్నిస్తుంటారు. అలాంటి వాళ్లనుండి జాగ్రత్తగా వుండాలి. సున్నితంగానే 'కాదు' అని చెప్పాలి. మనికిష్టం లేకపోయినా 'అవును' అంటే, ఆ తర్వాత ప్రమాదకరమైన పరిణామాలు సంభవించే అవకాశముంది. సో... అంత్యనిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలు! అవునా కాదా మీరే చెప్పండి.

సీరియల్

గొల్లపూడి నారాయణరావు



తెలుగుగడ్డ

గతవారం

ఇక్కడనుంచి కేంప్ను ఎత్తివేస్తున్నామని చెబుతాడు హావల్దారు. అది విన్న పటేలు దిగులుపడతాడు. వెళ్లొద్దంటూ వారిని వేడుకుంటాడు. వారు ససేమీరా అనడంతో పటేలుకూడా వారితో టౌనుకు బయల్దేరతాడు. సన్యాసి మరణం ప్రతాప్‌ను కలవరపెడుతుంది.

50వ భాగం

వెనకనుంచి ప్రతాప్‌రెడ్డి "యాదవా" అంటూ పిలిచాడు. యాదవరెడ్డి మాత్రం అదేదీ వినిపించుకోకుండానే పటేలు ఇంటిని సమీపించాడు. ఇంతలోనే ప్రతాప్‌రెడ్డి కూడా అతన్ని సమీపించాడు.

"ఏమిటిది యాదవా?" అనడిగాడు.

"ప్రతాప్! ఈసారి మాత్రం నాకు అడ్డురాకు, నా ఇల్లు మాదిరిగానే వీడి ఇంటిని అగ్ని జ్వాలలకు ఆహుతిచేస్తాను. నా తల్లిదండ్రులు పడిన బాధలకు ప్రతీకారం తీర్చుకుంటాను" అన్నాడు యాదవరెడ్డి. అతడు ఆవేశంతో బుసలు కొడుతున్నాడు. ఆవేదనతో ఊగిపోతున్నాడు.

యాదవరెడ్డి వైపుకు చూశాడు ప్రతాప్. అతడు పడుతున్న ఆవేదనను, ఆవేశాన్ని అర్థం చేసుకున్నాడు. ఆవేదనాభరితంగా అంతలోనే అతడి ముఖం గంభీరరూపం దాల్చింది.

"యాదవా, ఇంత మహాదేశంలో నీ తల్లిదండ్రులిద్దరే కనిపిస్తున్నారా? నీ తల్లిదండ్రులను గురించినవే కష్టాలుగా భావిస్తున్నావా? ఇతరులెవ్వరూ ఎట్టి హింసలకూ గురికావడం లేదనేగా నీ అభిప్రాయం? ఇంత స్వార్థం నీలో గూడు కట్టుకుని ఉందా? ఛీ ఛీ" అన్నాడు.

యాదవరెడ్డి తలవంచాడు.

తిరిగి ప్రతాప్ మాట్లాడాడు. "యాదవా, మన ధ్యేయం ఏమైందీ? మరచిపోయి అక్రమమైన ఆలోచనలకు తావిచ్చి స్వార్థాన్ని త్యాగం చేయలేకపోతున్నావు. వ్యక్తిగత ద్వేషాలు పెంపొందించుకుంటున్నావు. తెలుగు ప్రజలందరినీ మరిచిపోతున్నావు. వీరందరూ మనకు తల్లిదండ్రులు కారనుకుంటున్నావా?" అన్నాడు చుట్టూరా ఉన్న వారందర్నీ చూపుతూ.

యాదవరెడ్డి కన్నీరు కార్చాడు. హఠాత్తుగా ప్రతాప్‌ను కౌగిలించుకున్నాడు. బావురుమని ఏడ్చాడు. అతడి ఏడ్పును చూసి చుట్టూ గుమికూడినవారంతా కన్నీరు పెట్టారు. ప్రతాప్ యాదవరెడ్డిని ఓదార్చాడు. అక్కడ్నించి అతన్ని వెంటబెట్టుకుని బ్రహ్మారెడ్డి ఇంటివైపుకు నడిచాడు.

❖ ❖ ❖

దళంవారితో తెలుగుగడ్డ గ్రామంనుంచి బయల్దేరాడు ప్రతాప్. గ్రామ గ్రామానా బహిరంగసభలు జరిపి ప్రజలకు కర్తవ్యాలను బోధిస్తూ, మిలట్రీ రజాకార్లకు భయపడవద్దని ధైర్యంచెబుతూ, పంటకైళ్లు పనులు నిర్భయంగా చేసుకుంటూండమని హామీలు ఇస్తూ ముందుకు సాగిపోతున్నాడు. గ్రామగ్రామానా ప్రజలు దళంవారికి సుస్వాగతాలు పలుకుతున్నారు. గొప్ప గౌరవ మర్యాదలు ఇస్తున్నారు. టౌను రజాకార్లు చేసే దౌర్జన్యాలను చెప్పుకున్నారు. టౌను మిలట్రీ కేంపును లేకుండా చేస్తేనే మేం బతకగలమని మొరపెట్టుకున్నారు.

పొద్దుకుంకే సమయం అవుతోంది. ప్రతాప్ దళంవారితో సాహెబు పాలెం చేరుకున్నాడు. సాహెబుపాలెం బహుచిన్నది. అన్నీ కలసి పది ఇళ్లుంటాయి. సంగం దళం రాగానే చుట్టూరా నిలబడి వింతగా చూస్తున్నారు. చుట్టూ మూగినవారిలో ఎక్కువభాగం పిల్లలే ఉన్నారు. ప్రతాప్ వారివైపుకు చూసి నవ్వుతూ వారిని నవ్విస్తున్నాడు.

అంతలోనే గడ్డం సాహెబు ఒకడు పిల్లల గుంపును నెట్టుకుని వచ్చాడు. అరుగుపై కూర్చున్న ప్రతాప్ వైపుకు వినయంగా వంగి 'సలాం సలాం' అన్నాడు. ప్రతాప్‌కూడా 'సలాం సలాం' అన్నాడు నవ్వుతూ. తర్వాత సాహెబు వచ్చి పక్కన అరుగుపై కూర్చున్నాడు.

"తాతగారూ తమ పేరేంటి?" అడిగాడు ప్రతాప్.

"మహమ్మదాలీ నాయనా" అన్నాడు సాహెబు.

"మరి ఈ గ్రామంలో ముఖ్యులెవరెవరు తాతగారు?"

"అంత ముఖ్యులయిన వాళ్లెవరున్నారు? నలుగురు లంబాడీలు. ఇద్దరు యానాదులు, ఇద్దరు తెలగలు. ఆ ఇద్దరికే దున్నల వ్యవసాయం ఉంది. ఇకమేం అన్నదమ్ములం ఇద్దరం చెరి రెండెకరాలు కడతాం అన్నాడు"

"సరే ఉన్నవారి వరకే పిలిపించండి తాతగారూ. మాట్లాడి వెళ్లిపోతాం"

"అందరూ ఇక్కడే ఉన్నారు నాయనా. అతడు మా తమ్ముడు, వాళ్లిద్దరూ తెలగలు, వాళ్లు యానాదులు, వీళ్లు లంబాడీలు"

ప్రతాప్ వారందరివైపుకూ చూశాడు. రజాకార్లను గురించి, వారి దౌష్ట్యాలను గురించి మాట్లాడాడు. ప్రజలు తమ మానప్రాణాలను ఎలా రక్షించుకోవలసిందీ చెప్పాడు. అక్కడున్న ప్రజలందరూ కిక్కురుమనకుండా వింటూ నిల్చున్నారు. పావుగంటసేపు గడిచిపోయింది. చివరికి ప్రతాప్ ఉపన్యాసం చాలించాడు. సాహెబు వైపుకు చూసి "తాతగారూ ఇక వెళ్తాం శెలవివ్వండి" అన్నాడు.

సాహెబు కళ్ళు పెద్దవి చేసి చూశాడు. "అయ్యో మనవడా ఇప్పుడు వెళ్తావా? ఇంక చీకటిపడి ఎక్కడికెళ్తావు? మీ అందరికీ మా ఇంటివద్దనే భోజనం ఏర్పాటు చేయిస్తాను" అన్నాడు సాహెబు.

"మీకు శ్రమెందుకులెండి తాతగారూ? మేం రెండువందల మందిమి ఉన్నాం. ఇంకో పెద్ద గ్రామం చేరుకుంటాం"

"ఇందులో శ్రమ ఏముంది నాయనా. అంతగా అయితే ఒక బస్తా బియ్యం ఉడుకుతాయి. ఈమాత్రం దానికి భయపడ్తానా? మీరంతా ఈ రాత్రికి మా ఇంట్లోనే ఉందురుగానీ" అన్నాడు సాహెబు.

ప్రతాప్ ఆశ్చర్యపోయాడు. ఇంతవరకూ తమ దళం వారందరికీ ఒక్క చోటనే భోజనం ఎక్కడా దొరకలేదు. సాహెబు మాటలు విన్న తర్వాత మంచి భాగ్యవంతుడేనని తలచాడు. జాలి స్వభావం గల మనిషి అని నిర్ణయించుకున్నాడు. ఆ రాత్రికి అక్కడే ఉండాలని నిశ్చయించుకున్నాడు. దళం వారందరితో సాహెబు ఇంటికి వెళ్లాడు.

అతడి ఇంటి ఆవరణ చాలా విశాలంగా ఉంది. ఆవరణ చుట్టూరా చింత మొక్కలు, చాల్పుకోట మాదిరిగా ఉంది. ఇంటిముందు రెండు చింతలు, రెండు వేపలు ఉన్నాయి. ఇళ్ళు పూరిళ్లే అయినా చూడడానికి ఘనంగా కనిపించాయి.

సాయిబు లోపలున్న మంచాలన్నీ తెచ్చి వాల్చాడు. నాలుగయిదు చాపలు తెప్పించి కింద పరిపించాడు. అందర్నీ కూర్చోబెట్టి బయటికెళ్లిపోయాడు. అప్పటికి బాగా చీకటిపడింది. చింతలపైనుండి చల్లని గాలివచ్చి తగుల్తుంది. ప్రొద్దుగూకులూ తిరిగి అలసటతో ఉన్న దళం వారందరూ చొప్పకట్టల మాదిరి పడిపోయారు. అప్పటికప్పుడే గురకలు పెట్టి నిద్రలు తీస్తున్నారు.

ఒక్క గంటసేపు గడిచిపోయింది. బయటికెళ్లిన సాహెబు తిరిగి రానేలేదు. అంతసేపూ వెల్లకిలా పడుకున్న ప్రతాప్ పక్కకు తిరిగి "యాదవా" అని పిలిచాడు.

"ఏమిటి ప్రతాప్?" అన్నాడు యాదవరెడ్డి.

"సాహెబు ఏదో తంతు జరుపుతున్నాడని అనుమానం వేస్తోంది" అన్నాడు ప్రతాప్.

"అదే నాకూ అనిపిస్తోంది ప్రతాప్" అన్నాడు యాదవ.

అంతలోనే దూరంగా ఉన్న ప్రమీలాదేవి సమీపానికి వచ్చి కూర్చుంది. ఇంతసేపటినుండి నేనూ అదే ఆలోచిస్తున్నాను ప్రతాప్. ఇంతమందికి భోజనం ఏర్పాటుగావించే హంగామా ఏదీ కనిపించలేదు" అందామె.

"నిజమే ఇంట్లో చడీచప్పిడీ లేదు" అన్నాడు యాదవరెడ్డి.

"మనందర్నీ ఇక్కడికి చేర్చి అప్పుడనగా బజారుకెళ్లిన సాహెబు ఇంతవరకు తిరిగి రానేలేదు. ఇందులో ఏదో మోసం ఉంది" అంది ప్రమీలాదేవి.

"ఇక్కడికి టౌను నాలుగుమైళ్లే ఉంది. మనం వచ్చామని రజాకార్లకు చెప్పి తీసుకురావడానికి వెళ్లడేమో?" అన్నాడు యాదవరెడ్డి.

"అదే కావచ్చు. లేకపోతే ఇంతసేపూ ఊళ్లో ఏంచేస్తూ ఉంటాడు?" అంది ప్రమీల.

ప్రతాప్ తలూపి "ఏమయినా మనలనేం చేయగలడులే? ఇంతకూ సెంట్రీని నియమించావా యాదవా?" అన్నాడు.

యాదవరెడ్డి తలూపి "మనం గ్రామంలో ప్రవేశించక ముందే గ్రామం వెలుపలి మొండిగోడలపై మల్లారెడ్డిని, కృష్ణారెడ్డిని ఉంచివచ్చాను" అన్నాడు.

ప్రతాప్ భారంగా నిట్టూర్చి. "సరేకానీ, ఈ రాత్రికి ఏం జరుగుతుందో అదీ చూద్దాం" అన్నాడు.

"చూస్తూ కూర్చుంటే ఎలా ప్రతాప్? దీనికేమయినా ప్రతిక్రియ

ఆలోచించాలిగానీ" అంది ప్రమీలాదేవి.

ప్రతాప్ తలూపి లేచి నిల్చున్నాడు. చేలైటు, పిస్టల్ చేతబట్టి బయల్దేరాడు.

"మీరు ఇక్కడే ఉండండి. లోపల ఎవరైనా ఉన్నారో లేదో చూసి ఇప్పుడే వస్తా" అన్నాడు. చింతల చాలుకు పక్కగా సాహెబు ఇంటివెనుక సందుకు తిరిగి వచ్చాడు. లోపల్నుంచి నెమ్మదిగా మాటలు వినిపించాయ్. చప్పుడు కాకుండా కందికట్టె తడికల పక్కగా నిలబడ్డాడు.

"భోజనానికి రమ్మని ఇంత ద్రోహం తలపెడ్తావా? ఇది నేను సహించను" అంది ఆడగొంతు.

"ఇందులో ద్రోహం ఏముంది పిచ్చిదానా? వాళ్లందరూ ఎవరో తెల్సునా? మన సర్కారీని గద్దె దింపాలని ప్రచారాలు సాగిస్తున్న ద్రోహులు" అంటున్నాడు. ఒకడు. ఆ స్వరం తనతో మాట్లాడిన సాహెబుదని గుర్తించాడు ప్రతాప్. తలూపి చెవులు రిక్కించి వినసాగాడు.

"వీల్లేదు. నన్ను బయటికి పోనీ వాళ్లందరితోనూ ఈ సంగతి చెప్పేస్తాను ఎట్లాగో ప్రాణాలు కాపాడుకుని పారిపోతారు"

"నిన్ను నరికిపారేస్తా, ముందుకు అడుగువేయి చూస్తా"

"నీవు నన్నేం చేసినా ఇష్టమే. కానీ ఈ ఇంట్లో మాత్రం ఇట్లాంటి మోసం జరగడానికి వీల్లేదు. వాళ్ళ ఉసురంతా ఎవరికి తగుల్తుంది?" అందామె మొండిగా.

అతడు స్వరాన్ని తగ్గించి బతిమిలాడే ధోరణి అందుకున్నాడు. "అరే మేరీ బీబీ, నీకు ఆగేపీఛే తెల్వదు. ఆధాఘంటా ఆగితే సర్కారీ ఫౌజు వచ్చేస్తుంది. మనకు బహుమతి దొరుకుతుంది" అన్నాడు.

"నీ బహుమతి బందలుగానూ. ఇంతమంది ఉసురు కట్టుకుంటావా?"

"అరె నెమ్మదిగా మాట్లాడు బీబీ. బయటివాళ్లు వింటే నాటకం అంతా చెడిపోతుంది. బహుమతి కాస్తా కూస్తాగాదు. ఏక్ హజార్ రూపాయి బహుమతి చేయిస్తానన్నాడు బడేమియాసాబ్"

"బడేమియానా, వాడొట్టి లుచ్ఛా. బద్మాష్, మన గ్రామంలోని ఆడవాళ్లనందర్నీ చెరిపించాడు. నువ్వు వాడి మాటలు నమ్ముతుండావు"

"ఖామోష్, బద్మాష్" అనరిచి అతదామె చెంపపై కొట్టాడు. 'ఛళ్' అనే మోత వినిపించింది.

ప్రతాప్‌రెడ్డి ఇక సహించలేకపోయాడు. కందికట్టె తడికను ఫెళఫెళమని విరగదొక్కుకుంటూ లోపలికి దూకాడు.

బెదిరిపోయి చూస్తున్న సాహెబు గడ్డం వడిసి పట్టుకు బరబరా బయటికి లాక్కొచ్చాడు.

(ఇంకా వుంది)



నిర్ణయం...

కె. శివలీల

"హాయ్! ఏంటింత బిజీగా... ఓహో... న్యూ ఇయర్‌కు ఎలా వెల్‌కం చెప్పాలో ప్లాన్‌చేస్తున్నారా? అదంతా ఎప్పుడో కంప్లీటయిందా... నిజంగా మీరు చాలా స్పీడు గురూ... నేనూ మెడిసిన్ ఫస్టియర్ చదివేటప్పుడు... ఇలానే అంటే మీలానే ఉండేదాన్ని. 'మరి ఇప్పుడేమైంది?' మీ కనుబొమలు అకస్మాత్తుగా ముడిపడింది ఈ సందేహంతోనే కదూ... నాకు తెలుసు... మీ డౌట్‌ను క్లియర్ చేయాలంటే... నా ఫ్లాష్‌బాక్ చెప్పాల్సిందే..." అంటోంది మెడిసిన్ విద్యార్థిని దివ్య.

ఇంతకీ ఆమెకు ఎదురైన సంఘటన ఎలాంటిది? దాని పరిణామాలేంటి? వాటి పర్యవసానం ఆమె మనసుపై ఎలాంటి ప్రభావాన్ని చూపింది? ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికి దారితీసింది? ఇవన్నీ దివ్య మాటల్లోనే...

హాయ్... నా పేరు దివ్య. మెడిసిన్ స్టూడెంట్‌ను. పోయిన సంవత్సరం ఇదే రోజు నేను చాలా ఆనందంగా ఉన్నాను. ఎందుకంటే... అభినయ్ నాకు పరిచయమైంది ఆరోజేగా. అతను ఇంజనీరింగ్ స్టూడెంట్. అతను చదివేది బాంగ్ళూర్‌లో. నేనుండేది హైద్రాబాద్‌లో. కార్పొరేట్ కాలేజీలు... బిజీబిజీ షెడ్యూల్... నెట్‌లో గంటలుగంటలు గడపడం కష్టమే... వెరసి మా ఛాటింగ్ పరిచయం ట్రాక్ మారింది. మా చిట్‌చాట్ అంతా ఫోన్‌లోనే. ఈ బ్యాగ్‌గ్రౌండ్‌లో... నేను అతనికి ఫోన్ చేసిన సందర్భాలే ఎక్కువ. 'ఇట్స్ ఓన్లీ ఎట్రాక్షన్' అనుకుంటున్నారా? కానీ అప్పట్లో నేను దానికి పెట్టిన పేరు ప్రేమ... అవును! ఎప్పుడూ అతని ఊహలే... చదవాలనిపించేది కాదు. బొటాబొటీ మార్కులతో ఫస్ట్‌సెమ్ గట్టెక్కింది.

'నీ వల్లే నేను చదవలేకపోయాను...' ఈ మాట అతనికి చెప్పినప్పుడు మౌనమే అతని సమాధానమయింది. 'ఐయామ్ నాట్ ఇంట్రెస్టెడ్...' అని మొదట్లోనే నాతో చెబితే సరిపోయేదిగా... బాధపడినా... క్రమంగా అడ్జస్టయిపోయేదాన్ని. ఏ విషయాన్నీ బయటపెట్టడు. అతని మనసెలా అర్థంచేసుకోనూ... "ఏమో... అతనుండేది బెంగుళూరులోకదా... కొత్త గాళ్‌ఫ్రెండ్ ఎవరైనా..." నో... అలా ఊహించుకోవడానికే మనసొప్పలేదు. పరధ్యానం మరీ ఎక్కువైంది. ఒంటరిగా ఉండాలనీ, అతనిగురించే ఆలోచించాలనీ ఎప్పుడూ అనిపించేది. రోజులు భారంగా గడుస్తున్నాయి.

రెండు రోజుల్లో... అతని బర్త్‌డే. అతన్ని సర్‌ప్రైజ్ చేయడమెలా... ఆలోచిస్తుండగా మొబైల్ రింగైంది. స్క్రీన్‌పై అతని నెంబర్... నా ఆనందానికి హద్దుల్లేవు. "రేపు మార్నింగ్ హైద్రాబాద్‌కు వస్తున్నాను. మనం దిల్‌సుఖ్‌నగర్‌లో కలుద్దాం. మళ్లీ నీకు కాల్ చేస్తాను" అని ఎవరో తరుముతున్నట్లు మాట్లాడాడు. తెల్లవారడానికి ఇంతసేపు వెయిట్ చేయాలా అనిపించింది. నా ప్రోగ్రామ్స్ క్యాన్సిల్ చేసుకున్నాను. అతని ఫోన్ కోసమే ఎదురుచూస్తున్నాను. అయినా నో రిజల్ట్... నన్నిలా టెన్షన్ పెట్టడం వీడికలవాటేగా... చిన్న నవ్వు నా పెదాలమీద మెరిసింది. అది నిర్లక్ష్య ధోరణి అని ఆలోచించే స్పృహ నాకు లేదు. మధ్యాహ్నమైంది. అన్నం సహించలేదు. అతనొచ్చే ట్రెన్‌కేదైనా ప్రాబ్లమొచ్చిందేమో అన్న చిన్న అనుమానం. కుదురుగా ఉండలేకపోయాను. ట్రెన్ కరెక్ట్ టైంకే వచ్చింది రైల్వే ఎంక్వైరీవారి రెస్పాన్స్. మరి ఎందుకు ఫోన్ చేయలేదితను.....

సాయంత్రం నాలుగ్గంటలకు... అతని ఫోన్ రింగైంది. ఎక్కడున్నావ్... ఆతృతగా అడిగాను. ఆటోలో... అతని సమాధానం. ట్రాఫిక్ రణగొణ ధ్వనులు నా చెవులు దాటిపోలేదు. హమ్మయ్య... ఎలాగైతేనేం హైద్రాబాద్‌కొచ్చాడు అనుకున్నాను. "ఫైవ్ కల్లా వచ్చేయ్... లేటౌతుందని టెన్షన్‌పెట్టుకోకు... నిన్ను మీ హాస్టల్లో డ్రాప్‌చేసే పూచీ నాది...ఓకే" అతని మాటల్లో ఉత్సాహం నాకు ఉత్తేజాన్నిచ్చింది.

ఆటోలో దిల్‌సుఖ్‌నగర్‌కు బయల్దేరాను. బస్టాండ్‌కు చేరుకుని ఫోన్ చేశాను. 'ఫిఫ్టీన్ మినిట్స్‌లో వస్తున్నాను. నువ్వు సాయిబాబా టెంపుల్ దగ్గర వెయిట్ చేయ్...' అతని మాటల్లో వ్యంగ్యాన్ని గమనించలేకపోయాను. అరగంట గడిచింది. నెమ్మదిగా చీకట్లు కమ్ముకుంటున్నాయి. చాలామంది నన్ను విచిత్రంగా చూడసాగారు. అతను... ఇంకా రాలేదు. ఒకవేళ రాడేమో... ఆ ఆలోచనతో నా శరీరం చల్లబడింది. ఇంతరాత్రిలో నేనెలా వెళ్లడం... రూట్‌కూడా తెలీదే... ఆటోలో వెళితే... అమ్మో... ఏదైనా అనుకోని సంఘటన జరిగితే... ఒక్కసారిగా గుండె ఝల్లుమంది. నా మనసంతా బ్లాంక్‌గా అయిపోయింది.

అదురుతున్న గుండెను చిక్కబట్టుకుంటూ... మళ్లీ అతనికి ఫోన్ చేశాను. "నేను... బెంగుళూర్‌లోనే ఉన్నాను. అయినా నా బర్త్‌డేరోజు మా ఫ్యామిలీతో ఎంజాయ్ చేయకుండా హైద్రాబాద్‌కు వస్తానెలా అనుకున్నావ్..." అతను నవ్వుతున్నాడు. "అనుకోవడమేంటి? నువ్వే చెప్పావుగా వస్తానని. అయినా ఇక్కడందరూ నన్ను వింతగా చూస్తున్నారు. నాకు రూట్‌కూడా తెలీదు... ఎలా వెళ్లాలి నేను..." పూడుకుపోతున్న గొంతుతో అతికష్టంగా ప్రశ్నించాను. "మరీ ఫూల్‌లా మాట్లాడకు. నేనేదో జోక్ చేశాను. నువ్వు సీరియస్‌గా తీసుకున్నావ్. దట్సిట్! దీనికింతగా ఫీలవ్వాలా? ఎలా వచ్చావో అలాగే వెళతావ్. అయినా నాకోసం అంతదూరం వచ్చావ్‌గా... అదే నా బర్త్‌డే గిఫ్ట్ అనుకుంటాలే... బైబై" అతని మాటల్లో కనీస సానుభూతికూడా లేదు.

నా గుండె బాధతో బరువెక్కింది. కళ్లు మసకబారాయి. నలుగురూ చూస్తారు అన్న భావనే నా మనసుకు తట్టలేదు. జలజలా రాలుతున్న కన్నీళ్లను ఆపడం నావల్ల కాలేదు సరికదా... తుడుచుకోవాలన్న ఆలోచనకూడా రాలేదు. అతణ్ణి తిట్టుకోవాలనీ అనిపించలేదు. క్షేమంగా గమ్యం చేరడమే నా లక్ష్యం. ఆటోలో వెళ్లే సాహసం చేయలేదు. బస్టాండ్ ఎక్కడో, ఏ బస్సులు మా రూట్‌కు వెళతాయో అంతకన్నా తెలీదు. వేసుకున్న డ్రెస్‌కూడా సేఫ్టీనివ్వదని అప్పుడే తెల్సింది నాకు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాగోలా హాస్టల్‌కు చేరాను. రాత్రంతా వెక్కివెక్కి ఏడ్చాను. ఎంతమందో ఓదార్చారు... అయినా నా మనసు ఊరట చెందలేదు. ఇక ఎప్పుడూ అతనితో మాట్లాడకూడదని నిర్ణయించుకున్నాను. నా మనసు కొంచెం రిలాక్సయింది. ఏదో భారం తీరిన ఫీలింగ్... ఇప్పుడు నా దృష్టిలో ఉన్నది నా కెరీర్... ఇకపై దానికోసమే నా సమయాన్ని వెచ్చిస్తాను. ఇదే న్యూ ఇయర్ సందర్భంగా నేను తీసుకున్న నిర్ణయం...

సినిమా కబుర్లు

చందు

జీవితమే ఒక పోరాటం. ఏదైనా ఒక లక్ష్యాన్ని చేరాలంటే పోరాట పటిమ తప్పనిసరి. సినిమాల్లో తెర వెనకాల ఉండి సాహసాలు చేసే అన్నదమ్ములు(కవలలు) **'రామ్-లక్ష్మణ్'**లు నిజ జీవితంలో ఎదురైన పలు సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొని చిత్రసీమలో ఈరోజు బిజీ ఫైట్ మాస్టర్లుగా తమదైన ముద్ర ప్రదర్శిస్తున్నారు. వీరి ప్రతిభను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. 2004లో 'ఆర్య', 2005లో 'ఆంధ్రుడు' చిత్రాలకుగాను ఉత్తమ ఫైట్ మాస్టర్లుగా నంది అవార్డులందుకున్నారు. 2006లో 'విక్రమార్కుడు' చిత్రంతో హ్యాట్రిక్ కొడతామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సాహస వీరులు చెబుతున్న సినిమా కబుర్లు...

సాధించాలన్న గోల్ బండతో మొదలైంది

ప్రకాశం జిల్లా కారంచేడు మండలం నందిగుంట పాలెం అనే చిన్న గ్రామం మా జన్మ స్థలం. మేము ఐదుగురు అన్నదమ్ములం. ఒక అన్నయ్య, ఇద్దరు అక్కలు. నాన్నగారు వ్యవసాయం చేసేవారు. ఆయన నాటక కళాకారుడు కావడంతో మేము పదిమందికీ తెలియాలన్న కోరిక ఆయనకు బలంగా ఉండేది. మేం సినిమాల్లోకి రావడానికి కారణం ఆయనే.

అందరి కుర్రాళ్ళలాగే ఊళ్ళో కబాడీ, కోకో లాంటి పోటీల్లో పాల్గొనడమంటే ఆసక్తి ఎక్కువే. అందరిలా కాకుండా స్పెషల్‌గా, గొప్పగా ఏదో ఒకటి చేయాలన్న తాపత్రయం మాలో ఉండేది. మా ఊరి నడిబొడ్డులో ఒక పెద్ద గుండ్రటి బండ(సుమారు వంద కిలోల బరువు) ఉండేది. అరుగుల మీద కూర్చున్నప్పుడు 'మా తాత లేపాడు... మా ముత్తాత లేపాడు.. ఇప్పుడున్న కుర్రకారులో అంత సత్తా ఉన్నవాడు ఎవరూ లేరు...' అని పెద్దలు ఆ బండ గురించి మాట్లాడుకునేవారు. ఏంటి! వాడు లేపాడు... వీడు లేపాడు... అంటున్నారు, మనమెందుకు లేపకూడదన్న ఆలోచనొచ్చి ఊరి జనానికి తెలీకుండా రోజూ రాత్రిపూట వెళ్ళి ఆ బండను లేపేందుకు ప్రాక్టీస్ చేయడం మొదలుపెట్టాం. మా జీవితంలో సాధించాలన్న గోల్ ఆ బండతో మొదలైంది. బండ గుండ్రంగా ఉండడంతో పట్టుకోవడానికి పట్టుచిక్కేది కాదు. ఒక సంవత్సరం అలా ప్రాక్టీస్ చేశాం. వచ్చే జనవరి ఫస్టన ఈ బండను మేం లేపుతున్నాం అని చెప్పేసరికి అదిరిపోయి 'ఈ గొట్టంగాళ్ళు ఏం లేపుతారని' నిట్టూర్పులు విడిచారు. వంద కేజీల బండను మేమిద్దరం విడివిడిగా లేపేసరికి మా ఊరివాళ్ళంతా షాక్ తిన్నారు. ఈ సాహసంతో మేం మా ఊర్లోనేకాక, పక్క ఊర్లో కూడా ఫేమస్ అయ్యాం.

ఓడిపోయి ఖంగుతిన్నాం : ఆ సమయంలో మిలట్రీలోకి వెళ్ళాలనుకున్నా వెళ్ళే పద్ధతి, దారి తెలీలేదు. మాకు వ్యతిరేకంగా ఓ బ్యాచ్ తయారైంది. వేరే టైపులో ఓ బండను తయారుచేసి ఎత్తాలని పోటీ పెట్టారు. ఆ బండనైతే రోజూ రాత్రి పూట ఎవరికీ తెలీకుండా ప్రాక్టీస్ చేసి ఎత్తాం. కానీ ఈ బండ విషయంలో ఎత్తే నేర్పు, పట్టు తెలీక ఓడిపోయి ఖంగుతిన్నాం. ఏదో ఆటకాయతనంగా కాకుండా ఒక గురువు దగ్గరికెళ్ళి టెక్నిక్స్ నేర్చుకోవాలన్న ఆలోచన మెదిలింది. మా పక్కూరిలో హరినారాయణ(భీముడు) అనే బాడీ బిల్డర్ ఉన్నాడు. ఆయన చేయి రెండు చేతులంత ఉంటుంది. ఏదో ఎక్సర్‌సైజు చేస్తే వచ్చిన బాడీ కాదు. పుట్టుకతోనే చాలా బలిష్టంగా ఉండేవాడు. బండి మీద పది మందిని కూర్చోబెట్టి లేపేసేవాడు. ఈయన దగ్గర, శంకరరావు అనే మరో గురువు దగ్గర ఒక సంవత్సరం ప్రాక్టీస్ చేసి మెళకువలు నేర్చుకున్నాం. పాంప్లేట్స్ కొట్టించి ప్రకాశం జిల్లా మొత్తం మీద బహిరంగ పోటీ పెట్టాం. ఎన్ని కేజీలున్న వాడైనా సరే ఈ పోటీకి అర్హులే అని ప్రకటించి మా పక్కూరిలో పోటీలు నిర్వహించాం. 70-80 కిలోల బరువున్న మేము విడివిడిగా 160 కేజీల బండను నాలుగుసార్లు ఎత్తి ఫస్ట్, సెకండ్ ప్రైజ్‌లు తీసుకున్నాం. ఈ దెబ్బతో మా పేర్లు జిల్లా మొత్తానికి తెలిసిపోయాయి.

వెళ్ళడమూ అయ్యింది... రావడమూ అయింది

జనాలనుండి వస్తున్న అభినందనలు, జిల్లాలో మా పేర్లు మారుమోగడం... మాలో ఏదో తెలియని ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపినట్లయింది. ఊరు విడిచి ఎక్కడికైనా వెళ్ళి ఏదో ఒకటి చేయాలన్న తపన మొదలైంది. ప్రముఖ ఫైట్ మాస్టర్ రాజుగారిది మా పక్క ఊరే. ఆయన స్నేహితుడు మా నాన్నగారికి కూడా ఫ్రెండ్ కావడంతో వీళ్ళను సినిమాల్లోకి పంపిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన నాన్న కొచ్చింది. రాజు మాస్టార్ని సంప్రదిస్తే... 'పిలిపించండి చూద్దాం' అన్నారు. మేమిద్దరం ట్విన్స్ కావడం... అందులోనూ ఒకేలా ఉండడంతో మమ్మల్ని చూడగానే ఆయనకు ఒక మంచి ఇంప్రెషన్ కలిగింది. 'ఏం చేయగలరు?' అని అడిగారు. కర్ర సాధన చేస్తామంటే... చేయమన్నారు. భయం భయంగా ఇద్దరం కర్రలు తిప్పడం... అవి పరస్పరం తగలడంతో పడిపోయాం. అవగాహన కలగడానికి సినిమా ఫీల్డ్‌లో ఉండే కష్టాల గురించి వివరించారే గానీ మద్రాస్ తీసుకెళ్ళాలనుకోలేదు. అవకాశం కోసం సంవత్సరంపాటు ఆయన చుట్టూ తిరుగుతుండగా... 'ఇక వీళ్ళను తీసికెళ్ళొచ్చు' అన్న నమ్మకం కలిగి ఫలానా రోజు వెళదామన్నారు. వేటపాలెంనుంచి సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కు టిక్కెట్లు కూడా బుక్ చేశాం. రాత్రి పదింటికల్లా స్టేషన్‌కి చేరుకున్నాం. ఆరోజు రాత్రి ఒకటే గాలీవాన... రైళ్ళు నడవడంలేదు. ఆ రాత్రి స్టేషన్‌లోనే నిద్రపోయి తెల్లారిన తర్వాత రాజు మాస్టార్ని కలిస్తే... 'వర్షాల కారణంగా ట్రైన్లు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. నడవడం లేదు. రేపు వెళదా'మని అన్నారు. సరేలే అనుకున్నాం. ఆ వెంటనే ఆయనకు షూటింగ్ నిమిత్తమై పిలుపు రావడంతో మాకు చెప్పకుండా తక్షణమే మద్రాస్ వెళ్ళిపోయారు. 'వెళ్ళడమూ అయ్యింది... రావడమూ అయింది. అయినా ఆయన వీళ్ళనెక్కడికి తీసుకెళ్తారు? వీళ్ళు ఉట్టినే గప్పాలు కొట్టుకుంటున్నారు' అని ఊళ్ళో టముకు టముకైపోయింది. రెండోసారి మళ్ళీ షేమ్ అయ్యాం.

(ఇంకా వుంది)



బాలనేస్తాలు

చిత్రంలో వి'చిత్రం'



నేస్తాలూ...
ఈ బొమ్మ చూస్తుంటే మీకు ఏమనిపిస్తోంది. అస్సలు అది బొమ్మే కాదు. నిజమైన అమ్మాయే అని కదూ. అదే ఆర్టిస్టు అంకుల్ గొప్పతనం. నిజానికి తల లోపల వున్నదే నిజమైన అమ్మాయి.

చిన్నారి చిత్రకారులు



ఆర్.నీల,
9వ తరగతి,
ఎపిఎస్‌డబల్యుఆర్ స్కూల్, అచ్చంపేట,
అక్కారం, వనపర్తి.

హేయ్ చిన్నారులూ... కింద కనిపిస్తోందే...అది ఆస్ట్రేలియా మేప్ ఔట్‌లైన్. ఆస్ట్రేలియాలో కనిపించే జంతువులు, మొక్కలు (డింగో (కుక్క), మొసలి, కంగారూ, పెద్ద బల్లి, కోయలా, గొర్రె, యూకలిప్టస్, లైర్‌బర్డ్, ప్లాటిపస్) ఇక్కడ వున్నాయి వాటిని మీరు గుర్తించండి చూద్దాం.

కనిపెట్టండే

దారి కనుక్కోండి చూద్దాం



ఏవి ఎక్కడున్నాయో!

బుజ్జాయిలూ...
పక్కన వున్న బొమ్మ చూస్తుంటే చాలా ముచ్చటగా వుందికదూ. నక్క, బాతు కలిసి హాయిగా కబుర్లు చెప్పకుంటూ కూర్చున్నాయి. కాకపోతే ఆర్టిస్టు అంకుల్ మీకు ఓ పరీక్ష పెట్టాడర్రా. అదేంటంటే... ఈ బొమ్మలో బేస్ బాల్ క్యాప్, తాబేలు, సూది, బాతు, సీల, ఐస్‌క్రీమ్‌కోన్, సీతాకోకచిలుక, కాలి బూటు, స్పూను, రింగు, కత్తెర, ముసలివాళ్లు ఉపయోగించే కర్ర వున్నాయి. వాటిని గుర్తించండి చూద్దాం.

పిడుగులూ... కింది బొమ్మలో ఆరు జంతువులున్నాయి. ఏంటి అలా ఆశ్చర్యంగా చూస్తున్నారు! ఎక్కడా అనా!! అదేకదా సస్పెన్స్. ప్రతి జంతువుకూ ఒక్కో భాగం కనిపిస్తోంది ఈ బొమ్మలో. దాన్ని బట్టి వాటి పేర్లు చెప్పేయాలి.



రంగులు పులిమేద్దాం



ఫ్రెండ్స్! మీరేకాదు. జంతువులు కూడా స్నేహం చేస్తాయర్రా. చూశారా అవన్నీ ఒక చోట కూర్చుని ఎంచక్కా కబుర్లు చెప్పకుంటున్నాయో. అన్నట్టు ఆ రెండు బొమ్మలూ ఒకేలా వున్నట్టు అనిపిస్తుంది కదూ కాకపోతే అందులో పది తేడాలున్నాయి. వాటిని మీరు చిటికెలో కనిపెట్టాలి.

ఆ పది తేడాలేవో...



స్పేస్‌షటిల్.. డిస్కవరీ

ఆర్. ప్రవీణ్‌కుమార్

10, డిసెంబర్,2006..

అమెరికాలోని హ్యూస్టన్ ద్వీపంలో గల కెన్నెడీ స్పేస్ సెంటర్ శాస్త్రవేత్తలు, సందర్శకులతో కిటకిటలాడుతోంది. అందరిలోనూ ఉత్సుకత..

కౌంట్ డౌన్ ప్రారంభమైంది.

10.. 9.. 8..

సూదివేస్తే వినిపించేంత నిశ్శబ్దం..

7.. 6.. 5..4..

నరాలు తెగే ఉత్కంఠ..

3..2..1..

జీరో.. అనగానే షటర్లు తెరచుకున్నాయి.

నాసా ప్రతిష్ఠాత్మక స్పేస్‌షటిల్ 'డిస్కవరీ' పొగలు కక్కుతూ, నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి ఎగిరింది. 2003లో అంతరిక్ష నౌక 'కొలంబియా' భువికి చేరే సమయంలో నేలకూలిన దుర్ఘటన జ్ఞాపకాల శకలాలు ఇప్పటికీ వెన్నాడుతున్న క్రమంలో గంపెడాశతో డిస్కవరీ ప్రయోగానికి అమెరికా సిద్ధపడింది. ప్రయోగించిన అంతరిక్ష నౌక 36గంటల తర్వాత 11 డిసెంబర్ సాయంత్రం ఐదుగంటల భారత కాలమానానికి అంతరిక్ష కక్ష్యలోకి చేరుకోవడంతో మొత్తం ప్రయోగం సఫలీకృతమైంది. మరో ఆసక్తికర విషయమేంటంటే కొలంబియా కూలిన ప్రమాదంలోనే భారతీయ మహిళ కల్పనాచావ్లా ప్రాణాలు కోల్పోగా, 'డిస్కవరీ'లో భారత సంతతికి చెందిన సునీతావిలియమ్స్ అంతరిక్షంలో నడిచిన తొలిమహిళగా రికార్డు సొంతం చేసుకుంది. అంతరిక్ష పరిశోధనాకేంద్ర నిర్మాణంలో డిస్కవరీ సఫలం ఓ మరపురాని అధ్యాయం.

అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనాకేంద్రం (ఐఎస్ఎస్) నిర్మాణంలో భాగంగా జరిపిన స్పేస్‌షటిల్ ప్రయోగాల్లో కీలకమైనది డిస్కవరీ. ఇదే మిషన్‌తో బయల్దేరిన అంతరిక్ష నౌక కొలంబియా భూమికి తిరిగివస్తూ 2003 ఫిబ్రవరి1న పేలిపోయిన విషయం తెలిసిందే. దీంట్లో కల్పనాచావ్లాతోపాటు ఆరుగురు వ్యోమగాములు దుర్మరణం పాలయ్యారు. అప్పటినుంచి రాత్రిపూట వ్యోమనౌక ప్రయోగంపై నిషేధం ఉండేది. అయితే దీన్ని ఎత్తివేసి అమెరికన్ కాలమానం ప్రకారం రాత్రి 8.47 నిమిషాలకు డిస్కవరీని ప్రయోగించారు. ఎలాంటి సమస్యల్లేకుండా డిస్కవరీ అంతరిక్ష కక్ష్యలోకి చేరుకుందని నాసా చీఫ్ మైఖేల్ గ్రిఫిన్ ప్రకటించగానే అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా రెండుసార్లు వాయిదాపడిన డిస్కవరీ చివరకు డిసెంబర్ 10న అంతరిక్షంలోకి వెళ్లి, తిరిగి 22న భూమిని చేరుకోవడంతో 12 రోజుల మిషన్ పూర్తయ్యింది.

1970 ప్రాంతంలో సోవియట్ రష్యా 'సాల్యూట్' పేరిట, అమెరికా 'స్కైలాబ్' పేరిట రెండు వేర్వేరు చిన్నచిన్న పరిశోధనా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపాయి. వీటిలో స్కైలాబ్ అర్ధంతరంగా పనిచేయకపోవడంతో దాన్ని భూ ఆవరణలోనే ధ్వంసం చేశారు. 'సాల్యూట్' మాత్రం విజయవంతమైనా, అది పూర్తి ఫలితాలను సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో మరింత పట్టుదలగా మాడ్యులర్ డిజైన్‌లో రూపొందిన తొలి అంతరిక్ష ప్రయోగశాల 'మిర్'ను సోవియట్ రష్యా 1986లో ప్రయోగించింది. సూయజ్ అంతరిక్ష నౌకల ద్వారా తగిన నిర్మాణ సామాగ్రిని చేరవేస్తూ 'మిర్' ప్రయోగశాల నిర్మాణాన్ని రష్యా విజయవంతంగా పూర్తిచేసింది. మరోవైపు 'స్కైలాబ్' విఫలమైన తర్వాత అమెరికా ప్రయోగశాల నిర్మాణాన్ని పక్కనబెట్టి చంద్రయానంపై దృష్టి సారించింది. అయితే 1991వరకూ సోవియట్ యూనియన్ అంతరిక్ష పరిశోధనల్లో తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటూ వచ్చింది. లూకా కుక్కను అంతరిక్షంలోకి పంపడం, శాటిలైట్ లాంచ్ స్టేషన్ల నిర్మాణం, నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను చంద్రునిపైకి పంపడం వంటి అనేక విజయాలను నమోదు చేసుకుంది. అప్పట్లో రష్యాతో ఉన్న మిత్రత్వం కారణంగా భారతీయ వ్యోమగామి రాకేశ్‌శర్మకూడా అంతరిక్షయానం పూర్తిచేశాడు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో 'మిర్' నిర్వహణ పూర్తిగా దెబ్బతింది. దీన్ని దశాబ్దం తర్వాత రష్యా భూఆవరణలోకి దింపి మిర్‌ను ధ్వంసం చేసింది.

1993లో రష్యా మిర్-2 ప్రయోగానికి సిద్ధపడింది. అదే సమయంలో కెనడా, జపాన్,

ఐరోపాదేశాలతో కలిసి అమెరికా 'ఫ్రీడమ్' పేరుతో అంతరిక్ష ప్రయోగశాల ఏర్పాటుకు పూనుకుంది. ఆ తర్వాత జరిగిన చర్చల ఫలితంగా మిర్-2, 'ఫ్రీడమ్' కలిపి ఉమ్మడి ప్రాజెక్టుగా అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనాకేంద్రం (ఐఎస్ఎస్) నిర్మాణంపై ఒప్పందాలు జరిగాయి. అంతరిక్ష పరిశోధనలో ఉమ్మడిగా ప్రయోగాలు జరపడం ద్వారా ఫలితాలు సాధించవచ్చన్న ఆలోచనతో మొదట అమెరికా, రష్యా, కెనడా, జపాన్, బ్రెజిల్ తదితర 15దేశాలు అంతర్జాతీయ పరిశోధనాకేంద్రాన్ని అంతరిక్షంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. అయితే అప్పటికే అంతర్గత తిరుగుబాటుతో సతమతమవుతున్న రష్యా తనవంతు నిధులను సమకూర్చడంలో వెనకడుగువేసింది. ఈ కారణంగా జాప్యమైన ఐఎస్ఎస్ నిర్మాణం 1998 నుంచి అప్రతిహతంగా సాగుతూ వస్తోంది. 1998లో జైరా (రష్యన్ భాషలో సూర్యోదయం) అన్న పేరుగల వాహకనౌక ద్వారా ఐఎస్ఎస్ నిర్మాణం ప్రారంభమైంది.

ఆ తర్వాత వరుసగా జులై 2000లో జ్వెజ్డా, అక్టోబర్ 2000లో షటిల్ డిస్కవరీ, నవంబర్ 2000లో సోయుజ్, ఫిబ్రవరి 2001లో షటిల్ అట్లాంటిస్, ఏప్రిల్ 2002లో సోయుజ్ రిప్లేస్‌మెంట్ మిషన్, ఫిబ్రవరి 2003 కొలంబియా, జులై 2006 అట్లాంటిస్ అంతరిక్షవాహక నౌకల ప్రయోగాలు జరిగాయి. నవంబర్ 2000లో తొలిసారిగా ఐఎస్ఎస్ స్టేషన్‌కు పూర్తిస్థాయి సిబ్బందిని పంపారు. వీరిలో ఒకరు అమెరికన్‌కాగా, ఇద్దరు రష్యన్లు. వీరిలో ప్రతీ ఆరునెలలకు ఒకరు మారుతుంటారు. వీరుకాకుండా ప్రతీ ఆరునెలలకోసారి ఆరుగురు సభ్యుల బృందం వచ్చి వెళ్తుంటుంది. వీరు తరచూ మారుతూ అవసరమైన సామగ్రిని ఐఎస్ఎస్ సెంటరుకు చేరుస్తూ, నిర్మాణంలో పూర్తికాలపు సిబ్బందికి సహకరిస్తారు. ఒక్కో స్పేస్‌షటిల్ మిషన్ 12 నుంచి 15 రోజుల వరకూ ఉంటుంది. ఈ క్రమంలో డిసెంబర్ 10, 2006న ప్రయోగించిందే డిస్కవరీ.

విలియం ఓఫ్లిన్ (పైలట్), జాన్.ఇ. హగిన్‌బోథమ్ (మిషన్ స్పెషలిస్టు), మార్క్ పొలాన్‌స్కీ (కమాండర్), వ్యోమగాములు రాబర్ట్ కర్బీమ్, నికోలాస్ పాట్రిక్, సునీతా ఎల్. విలియమ్స్‌తోపాటు ఐరోపా స్పేస్ ఏజెన్సీ తరపున క్రిస్టియర్ ఫ్యుగల్‌సంగ్ (ఆల్ మిషన్ స్పెషలిస్టు) క్రూ సిబ్బందిగా ఉన్న డిస్కవరీలో ఇద్దరు మహిళలు. సునీతా విలియమ్స్ ఈ ప్రయోగం ద్వారా అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారత సంతతి మహిళ (కల్పనాచావ్లా మొదటి మహిళ) కాగా, అంతరిక్షంలో స్పేస్‌వాక్ చేసిన మొదటిమహిళగా రికార్డులకెక్కింది. సాధారణంగా ఈ వ్యోమగాముల ఎంపికకు సంబంధించి తగిన అర్హతలున్నవారిని గుర్తించాల్సిందిగా నాసా అమెరికన్ మిలిటరీ విభాగాన్ని కోరుతుంది. వారు సూచించే 23మందిలో నుంచి ఏడుగురిని ఫైనల్‌గా ఎంపిక చేస్తారు. ఇప్పటివరకు 831మంది వ్యోమగాములను ఎంపిక చేశారు.

తన 13రోజుల మిషన్ ద్వారా డిస్కవరీ సిబ్బంది ఐఎస్ఎస్ విద్యుత్ వ్యవస్థను రీ-వైరింగ్ చేశారు. డిసెంబర్ 17న స్పేస్‌వాక్ నిర్వహించి పి-5 స్పేసర్ ట్రస్‌సెగ్మెంటును కొత్తగా అమర్చారు. దాదాపు రెండుటన్నుల బరువైన పరికరాలను ఈ వాహకనౌక ఐఎస్ఎస్‌కు చేర్చింది. గత ఆరునెలలుగా ఐఎస్ఎస్‌లో పనిచేస్తున్న థామస్ రీటర్‌ను భూమికి తీసుకురావడంతోపాటు, అతని స్థానంలో సునీత ఐఎస్ఎస్‌లో ఉంటుంది. ఆమె ఆరునెలలపాటు అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్ర నిర్మాణంలో పాల్గొంటారు.

అంతరిక్ష నడకే కీలకం..

మొత్తం డిస్కవరీ మిషన్‌లో క్ర్యూ కోసం వ్యోమగాములు చేసే అంతరిక్ష నడక (స్పేస్‌వాక్) కీలకం. అంతరిక్షనౌక బయట వ్యోమగాములు చేసేదాన్ని ఇవిఎ (ఎక్స్‌ట్రా వెహిక్యులర్ యాక్టివిటీ)గా వ్యవహరిస్తారు. అందులో అత్యంత కీలకమైంది స్పేస్‌వాక్. స్పేస్‌షటిల్ నుంచి అలా శూన్యంలో ఎగురుతూ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోవడమనేది వ్యోమగాముల చిరకాలపు కల. అరుదుగా అంతరిక్ష కేంద్ర రిపేరు కోసం, సాధారణంగా అంతరిక్ష నౌకల మధ్య మార్పిడికి, తరచుగా వ్యోమగాముల రిలాక్సేషన్ కోసం ఈ 'స్పేస్‌వాక్' నిర్వహిస్తారు. షటిల్‌లో కృత్రిమ వాతావరణం ఉంటుంది. సమానమైన ఒత్తిడి, సరైన ఉష్ణోగ్రత, శ్వాసతీసుకునేందుకు సరిపడ గాలి.. ఇవన్నీ అందులో ఉంటాయి. షటిల్ ముందు భాగంలో నీరు, ఎయిర్ పంపులు అందుబాటులో ఉంటాయి. యూనిట్‌లోని 32000 టైల్స్ ఉష్ణోగ్రతను స్థిరంగా ఉంచగలుగుతాయి. షటిల్‌ను వదిలి అంతరిక్షంలోకి వ్యోమ గాములు వెళ్లినప్పుడు వాళ్ల స్పేస్‌సూట్‌లోనే ఉండే పోర్టబుల్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్ వారికి ఉపకరిస్తుంది. మొదట షటిల్ హాచే లోకి వ్యోమగాములు ప్రవేశించగానే నౌక డోర్లు మూసుకుపోతాయి. అనంతరం మెల్లగా తెరచుకునే మెట్లను పట్టుకుని గాల్లో తేలతారు. అదంతా శూన్యమే కాబట్టి అక్కడ గురుత్వాకర్షణ శక్తి ఏదీ పనిచేయదు. ఫలితంగా పడిపోవడమనేది జరగదు. నడక భారంగా ఉంటుంది. ఎడ్వర్డ్ వైట్ అనే వ్యోమగామి ఇలా అంతరిక్ష నడక పూర్తి చేసిన తొలివ్యక్తిగా రికార్డులకెక్కాడు. దాదాపు 20నిమిషాలపాటు స్పేస్‌వాక్ చేసి, 120 మైళ్ల ఎత్తునుంచి భూమిని ఫొటోలు కూడా తీశాడు. ఇక చంద్రునిపై నడిచిన తొలి వ్యోమగామిగా నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ 1969 జులై 20న రికార్డు సొంతంచేసుకోగా, ఆయన తర్వాత 19





నిమిషాలకు మరో వ్యోమగామి బజ్ ఆల్‌డ్రిన్ చంద్రయానం పూర్తిచేశాడు.

ఈ సూటు ఖరీదు 15లక్షలు.!

అది సాదాసీదా సూటు కాదు. మన రూపాయల్లో చెబితే దాని ఖరీదు అక్షరాలా 15లక్షల పైచిలుకే. శరీరం మొత్తాన్నీ కప్పేసే ఈ సూట్‌లో తలచుట్టూ హెల్మెట్ కూడా ఉంటుంది. ఇదంతా వ్యోమగాములకు ప్రత్యేకం. దాన్నే 'స్పేస్ సూట్' అంటారు. డిస్కవరీ అంతరిక్ష నౌకలో వ్యోమగాములు ధరించిన ఈ సూట్‌కి మరో ప్రత్యేకత కూడా ఉంది. అది అత్యవసర సమయాల్లో 30 నిమిషాల సేపు లైఫ్ జాకెట్‌గా కూడా ఉపయోగపడేలా దాన్ని రూపొందించారు. కొలంబియా దుర్ఘటన తర్వాత వ్యోమగాములు ధరించే సూట్‌లలో పూర్తిస్థాయిలో మార్పులు చేస్తున్నారు.

మనం చలికాలంలో స్వెటర్లు, దుప్పట్లు ఒంటినిండా కప్పేసుకుని కూడా వణికిపోతుంటాం. అలాంటిది భూకక్ష్యకు 50వేల అడుగుల ఎత్తులో ఉన్న అంతరిక్షవాతావరణంలో ఉండటమంటే సామాన్యమైన విషయమేమీ కాదు. అలాంటి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రత్యేకమైన దుస్తులు కావాలి. అంతేగాక గాలికూడా లేని శూన్యావరణంలో వ్యోమగామి ఆక్సిజన్ తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. స్పేస్ సూట్ ఒత్తిడిని, చలిని, వేడిమిని తట్టుకునేలా రూపొందిస్తారు. ఫైబర్ స్క్రిమ్లాటిక్ అనే ప్రత్యేక పదార్థంతో ఈ దుస్తులు తయారవుతాయి. పొరలు పొరలుగా రూపొందించిన వాటిని కలిపి దృఢంగా చేస్తారు. ప్రధానంగా అంతరిక్షంలో వాయుపీడనాన్ని తట్టుకునేందుకు వీలుగా ఈ రక్షక దుస్తులను రూపొందిస్తారు. అంతరిక్ష వాహక నౌకలో ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా వ్యోమగాములు 35-50 అడుగుల ఎత్తునుంచి ఎమర్జెన్సీ సీటింగ్ ద్వారా బయటకు వస్తారు. వ్యోమగామి ఒత్తిడిని తట్టుకునేలా దీన్ని రూపొందిస్తారు. భూవాతావరణంలోకి రావటంతోనే అది పారాచూట్‌ని ఓపెన్ చేస్తుంది. ఒకవేళ పొరపాటున సీట్‌తో సహా సముద్రంలో పడినా మునగకుండా తేలేలా చేస్తుంది. ఇదే తరహాలో స్పేస్‌సూట్ ఉంటుంది. సెకనుకు 15 కిలోమీటర్ల వేగంతో కిందకు వచ్చేప్పుడు కలిగే ఒత్తిడికి మంటలు సైతం రావొచ్చు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకునే స్పేస్‌సూట్ రూపకల్పన జరుగుతుంది.



అంతరిక్ష ప్రయోగశాల 'ఐఎస్ఎస్'

కదిలే ప్రయోగశాల 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం' అంతరిక్ష ప్రయోగాలకీ, పరిశోధనలకీ కేంద్రంగా ఉంటూ వస్తోంది. ఇప్పటివరకూ రూపుదిద్దుకున్న భూఉపగ్రహాల్లో కెల్లా ఇది అతి పెద్దది. దీని బరువు 180 టన్నులు. విస్తీర్ణం ఓ పెద్ద ఫుట్‌బాల్ స్టేడియం అంత ఉంటుంది. ఇది మనకు 400 కిలోమీటర్ల దూరంలో ఉంది. 1998లో ప్రారంభమైన ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్ నిర్మాణం ఇప్పటివరకూ తీసుకున్న అతిపెద్ద ప్రాజెక్టులో మొదటిది. వాస్తవానికి ఈ సంవత్సరాంతానికి దీని నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. అయితే కొలంబియా దుర్ఘటన, విపరీతంగా పెరిగిన నిర్మాణ వ్యయం, ఇతరత్రా కారణాలవల్ల జరిగిన జాప్యంతో ఇది 2010కి పూర్తికావచ్చని భావిస్తున్నారు. అమెరికన్ అంతరిక్షనౌకలు, రష్యన్ రాకెట్లు కలిసి మొత్తం 80 ఫ్లైట్లు ఐఎస్ఎస్ నిర్మాణానికి అవసరమవుతాయి.

2000 సంవత్సరంలో ఒక అమెరికన్, ఇద్దరు రష్యన్లు పూర్తికాలపు సిబ్బందిగా ఐఎస్ఎస్‌ను చేరుకున్నప్పటినుంచి దీని నిర్మాణం ప్రారంభమైంది. ప్రతీ ఆరునెలలకోసారి సిబ్బందిని మారుస్తుంటారు. 15 దేశాలు ప్రత్యక్షంగా, 32దేశాలు పరోక్షంగా దీని నిర్మాణంలో పాలుపంచుకుంటున్నాయి. అమెరికా, రష్యా ప్రధానమైన మాడ్యుల్స్‌ను, ఇతర నిర్మాణ సామాగ్రిని అందిస్తుండగా, కెనడా ఓ కదిలే రోబోటిక్ చేతిని ఐఎస్ఎస్‌కు అందించింది. దీని ద్వారా మానవరహితంగా ఐఎస్ఎస్ బయటివైపు రిపేరులకు అవకాశముంటుంది. జపాన్, బ్రెజిల్ ఇతర పరికరాలను అందించడంతోపాటు తమ వ్యోమగాములను అక్కడికి పంపేందుకు అంగీకరించాయి.

కల్పనా కలను సాకారం చేసిన సునీత

డిస్కవరీలో వెళ్లి అంతరిక్ష నడక పూర్తిచేసిన ఘనత దక్కించుకున్న సునీతా విలియమ్స్ భారత సంతతికి చెందిన తొలి మహిళ. కొలంబియా దుర్ఘటనలో మృతిచెందిన భారతీయ వ్యోమగామి కల్పనాచావ్లా కలను సునీత ఇలా సాకారం చేశారు. రెండో ప్రయత్నంలో వ్యోమగామిగా ఎంపికైన సునీతా 'అదంతా అలా జరిగిపోయిందంతే. వ్యోమగామిని కాకపోయుంటే ఈపాటికి కొలంబియా యూనివర్సిటీ లైబ్రరీలో పుస్తకాలమధ్య గడిపేస్తూ ఉండేదాన్ని' అంటున్నారు. 'వ్యోమగాములకు పొడవాటి జుట్టు పనికిరాదు.. తీసేయాల్సిందే..' అంటూ స్పేస్‌సెంటర్ అధికారులు కరాఖండీగా చెప్పినప్పుడు సునీత పెద్ద గొడవే చేసింది. తన జుట్టు తన పనికి ఆటంకం కాదని అంటూనే, 'నా పొడవాటి జుట్టంటే నాకెంతో ఇష్టం. తగిన కారణమేదీ చెప్పకుండా వెంట్రుకలు కత్తిరించాల్సిందేనని ఒత్తిడిచేస్తే ఆస్ట్రోనాట్‌గానైనా వదులుకుని కోర్టును ఆశ్రయించేదాన్ని. కానీ అందుకు వాళ్లు అవకాశమివ్వలేదు' అంటూ గలగలా నవ్వేసింది సునీత. ఆమె తండ్రి ఆమెరికాలో స్థిరపడిన భారతీయుడు దీపక్‌పాండ్యా కాగా, తల్లి యుగోస్లేవియా వనిత. డిసెంబర్ 17న అంతరిక్షంలో స్పేస్‌వాక్ నిర్వహించి, తొలి భారత సంతతి మహిళగా సునీత రికార్డు దక్కించుకున్నారు. ఈ ఏడాది జులై నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న థామస్ రాయిటర్ భూమికి తిరిగివస్తుండటంతో ఆయన స్థానంలో సునీత ఆరునెలలపాటు ఐఎస్ఎస్‌లో గడుపుతారు. తనవన్నీ తండ్రి బుద్ధులని చెప్పే సునీత హిందీ మాట్లాడగలదు కూడా. అందుకే తన తండ్రి తనకు హిందీలో రాసిన లేఖను, ఆయన బహూకరించిన భగవద్గీతను, వినాయక విగ్రహాన్ని ఆమె తనవెంట తీసికెళ్లింది. 'నేను అమెరికన్ నావెల్ అకాడమీలోకి ప్రవేశించేనాటికి అందమైనవాళ్లు మాత్రమే వ్యోమగాములవుతారని నమ్మేదాన్ని. డిస్కవరీ కోసం నేను ఎంపికైన తర్వాత గానీ అసలు విషయం తెలీలేదు' అనే సునీతలో హాస్యచతురత కాస్త ఎక్కువేనన్పిస్తోంది కదూ!



ఆరోగ్యం

డాక్టర్ టి. శంకర్,
కన్సల్టెంట్ డెంటిస్ట్,
డాక్టర్ గౌడ్స్ హాస్పిటల్,
కోఠి, హైదరాబాద్.
9441333906

ఫ్లాసింగ్ చేసుకోవడం ఎలా?

పళ్ళమధ్య ఇరుక్కున్న ఆహార పదార్థాలు తొలగించేందుకు మనం రకరకాల పద్ధతులు ఉపయోగిస్తుంటాం. మనలో చాలామంది పిన్నీసులతోనూ, పుల్లలు, సూదులు లేదా గుండుసూదులతో పళ్ళమధ్య ఇరుక్కున్న ఆహార పదార్థాలను తొలగించేందుకు ప్రయత్నిస్తుంటారు. కొందరు వేపపుల్లతో పళ్ళ సందుల్లో ఇరుక్కున్న ఆహార పదార్థాలు తొలగిస్తారు. కొంతవరకు వేపపుల్లతో పళ్ళుతోముకోవడం, పళ్ళ మధ్య ఇరుక్కున్న ఆహార పదార్థాలు తొలగించడం మంచిదే అయినా ఫ్లాసింగ్ చేసుకోవడమే అన్నింటికన్నా ఉత్తమమైన పద్ధతి. ఫ్లాస్‌తో పళ్ళమధ్య ఇరుక్కున్న ఆహార పదార్థాలు తొలగించడమే ఫ్లాసింగ్. **అంటే ఒకరకమైన దారం అని చెప్పుకోవచ్చు.**

ఎందుకు చేసుకోవాలి?: పళ్ళమధ్య ఆహార పదార్థాలు మిగిలిపోతే అవి కుళ్ళిపోవడం, బ్యాక్టీరియా యాక్షన్, పళ్ళు, చిగుళ్ళు పాడైపోవడం జరుగుతాయి. కాబట్టి మీరు ఎలాంటి ఆహారం తీసుకున్నా బ్రష్ చేసుకుంటే సరిపోదా అని ప్రశ్నించడంకాదు. మొత్తానికి పళ్ళు మాత్రం శుభ్రంగాఉండాలి.

బ్రష్ చేసుకుంటే సరిపోదా?: నిజమే పళ్ళు తోముకుంటే సరిపోతుంది కదా! మళ్ళీ ఫ్లాసింగ్ ఎందుకు అని చాలామంది అనుకుంటారు. కానీ బ్రష్ పళ్ళు, పళ్ళసందుల్లో ఇరుక్కున్న ఆహార పదార్థాలను పూర్తిగా తొలగించలేదు. కనుకనే ఫ్లాస్ అనే సన్నని దారంతో ఫ్లాసింగ్ చేసుకోవాలని దంత వైద్యులు తమ దగ్గరకు వచ్చిన రోగులకు సలహా ఇస్తుంటారు. ఫ్లాసింగ్ చేసుకోవడం గురించి ఇప్పుడు అంతా తెలుసుకుంటున్నారు. కానీ ఎన్నో ఏళ్ళనుంచి ఈ పద్ధతి అందుబాటులో ఉంది. మందులషాపుల్లో ఈ ఫ్లాస్ దొరుకుతుంది. కొనుక్కుని ఉపయోగించవచ్చు.

ఫ్లాసింగ్ చేసుకోవడం ఎలా?: ముందుగా డెంటల్ ఫ్లాస్ చేతిలోకి తీసుకుని బాగా సాగతీయండి. ఆ తర్వాత దారాన్ని బొమ్మలో చూపినట్టుగా రెండు చేతి వేళ్ళ మధ్యలోంచి పట్టుకోండి. ఆ తర్వాత నెమ్మదిగా ఒక్కో పన్ను సందులోంచి పోనిచ్చేటప్పుడు సున్నితంగా వ్యవహరించండి. బలవంతంగా పళ్ళమధ్య నుండి ఫ్లాస్‌ను లాగకండి. మొట్టమొదటిసారి ఫ్లాసింగ్ చేసకుంటున్నప్పుడు పళ్ళనుండి రక్తం కారవచ్చు. రక్తం వస్తోందని భయపడి చాలామంది ఫ్లాసింగ్ చేసుకోవడం ఆపేస్తుంటారు. నిజానికి కొత్తలో ఇలా జరుగుతుంది తప్ప, మీరు ఫ్లాసింగ్ చేసుకుంటున్న ప్రతీసారి ఇలా రక్తం కారదు. రెండు మూడుసార్ల తర్వాత కూడా ఫ్లాసింగ్ టైమ్‌లో మీ చిగుళ్ళనుంచి రక్తం కారుతుంటే మాత్రం వెంటనే ఫ్లాసింగ్ ఆపివేసి డాక్టర్ని సంప్రదించండి.

+ఎటువంటి ఫ్లాస్ వాడాలి? , వాక్స్డ్, అన్‌వాక్స్డ్, నైలాన్ ఇలా ఎన్నోరకాల ఫ్లాస్‌లు మార్కెట్లో లభిస్తుంటాయి., +ఫ్లాసింగ్ ఏ విధంగా చేసుకోవాలి? -ఎప్పుడెప్పుడు ఫ్లాసింగ్ చేసుకోవాలి? తదితర సందేహాలను నివృత్తి చేసుకోవాలంటే మీ దంత వైద్యుని సంప్రదించండి.

మౌత్‌వాష్: 'మీ నోరు వాసన వస్తోందా? మీ నోటి దుర్వాసన మీకు సమస్యలు తెచ్చిపెడ్తోందా? అయితే ఫలానా మౌత్‌వాష్ వాడండి' అని ప్రకటనల్లో చూస్తుంటాం. మౌత్‌వాష్‌లలో ప్రస్తుతం మూడు రకాల మౌత్‌వాష్‌లు లభిస్తున్నాయి. 1.ఫ్రెషనర్స్, 2.మెడికల్ మౌత్‌వాష్‌లు, 3.యాంటీ మైక్రోబియల్ మౌత్‌వాష్‌లు. ఇప్పుడు వీటిల్లో ఒక్కోదాని గురించి తెలుసుకుందాం.

ఫ్రెషనర్స్ : పేరుకు తగినట్టుగానే ఇవి నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. అయితే ఫ్రెషనర్స్ వాడటం వలన నోటి దుర్వాసన పూర్తిగా తగ్గదు. కొంత సమయం వరకు తాజా అనుభూతి కలుగుతుంది. ఇవి పుదీనా కానీ దాల్చిన చెక్క కానీ కలిగి ఉంటాయి. తాత్కాలిక ఉపశమనం కోసమైతే ఈ మౌత్ ఫ్రెషనర్స్‌ను వాడుకోవచ్చు.

మెడికల్ మౌత్‌వాష్‌లు :మార్కెట్‌లో ఇప్పుడు ఎన్నో రకాల మౌత్‌వాష్‌లు లభిస్తున్నాయి. ఇవి నోటి దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియాను కొంతవరకు నాశనం చేయడం ద్వారా నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. ఈ మౌత్‌వాష్‌లలో మెంథాల్, బెన్‌జాయిక్ యాసిడ్, థైమాల్, యూకలిప్టస్ ఆల్కహాలు మొదలైనవి ఉంటాయి. డాక్టర్ సలహామీద మెడికల్ మౌత్‌వాష్‌లు ఉపయోగించాల్సి ఉంటుంది.

యాంటీ మైక్రోబియల్ మౌత్‌వాష్: ఇవి కూడా మందుల షాపుల్లో లభిస్తాయి. కొన్నింటిలో క్లోరోహెక్సిడైన్ గ్లూకోనేట్ ఉంటే కొన్నింటిలో ప్రొవిడోన్ అయోడిన్ ఉంటుంది. సోడియం ఫ్లోరైడ్ ఉన్న మౌత్‌వాష్‌లు దీర్ఘకాలం ఉపయోగించడంవల్ల హానికరం. వీటిని ఎక్కువ కాలం వాడటం వలన మన నోటిలో ఉండే మేలుచేసే బ్యాక్టీరియా కూడా నాశనం అవుతుంది. అంతేకాదు నోటిలోని అతి సున్నిత భాగాలు దెబ్బతింటాయి కూడా.

మౌత్‌వాష్ అవసరమా?! : నోటిదుర్వాసనతో బాధపడేవారు తప్పకుండా మౌత్‌వాష్ వాడి తీరాలని చెప్తారు. నిజమే... ఎందుకుంటే నోటి దుర్వాసన సమస్యవల్ల తాము బాధపడటంతో పాటు ఇతరుల్ని కూడా బాధపెట్టాల్సి వస్తుంది. నోటిదుర్వాసన సమస్య నలుగురిలో నగుబాటుకు కారణం అవుతుంది. ఈ సమస్య కారణంగా నలుగురితో ఫ్రీగా కలవలేం, మాట్లాడలేం. కాబట్టి నోటిదుర్వాసనతో బాధపడేవారు తప్పకుండా ప్రత్యామ్నాయ మార్గం గురించి ఆలోచించాలి. మౌత్ ఫ్రెషనర్స్‌తో నోటిదుర్వాసన సమస్య తాత్కాలికంగా తీరిపోతుంది. అయితే ఇలా నోటి దుర్వాసనతో బాధపడేవారు మొదట రోజుకి రెండుసార్లు బ్రష్ చేసుకోవడం, ఫ్లాసింగ్ చేసుకోవడం వంటివి అలవార్చుకోవాలి. ఏదైనా అనారోగ్యంతో బాధపడ్తున్నారేమో చెక్ చేయించుకోవాలి. ఉల్లి, వెల్లుల్లి వంటివి తిన్నాక కూడా నోరు వాసన రావచ్చు. ఇలాంటప్పుడు పుదీనా కానీ లవంగం, దాల్చిన చెక్క వంటివి కానీ నమిలితే కొంత ప్రయోజనం ఉంటుంది. ఏది ఏమైనా నోటి దుర్వాసన తగ్గాలంటే బ్రషింగ్, ఫ్లాసింగ్ ఈ రెండూ తప్పనిసరి. అలాగే మీకు తోచిన మౌత్ ఫ్రెషనర్ వాడటం కాకుండా దంతవైద్యుని సంప్రదించి ఆయన సలహా తీసుకున్నాక మౌత్ ఫ్రెషనర్స్ వాడటం మొదలు పెట్టండి.

కథ

బూదరాజు ఫణికుమార్

ప్రేమ

రవి, శ్రీనివాస్ చిన్ననాటి మిత్రులు. రవి ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్ వచ్చి శ్రీనివాస్ గదిలో దిగాడు. పలకరింపులూ, పరామర్శలూ పూర్తయ్యాయి.

"నేను బయటకు వెళ్తొస్తాను. నువ్వు రెస్ట్ తీసుకో" అని శ్రీనివాస్ బయటకు వెళ్లాడు.

రవి స్నానం చేసి బాల్కనీలో నిలబడి కాఫీ తాగుతున్నాడు. అటూయిటూ చూస్తూ అతిమామూలుగా ఎదురుగా వున్న ఫ్లాట్ వైపు చూశాడు.

అక్కడో అమ్మాయి పుస్తకం చదువుకుంటోంది.

పుస్తకం ముఖానికి అడ్డుగా వుండటంతో ఆమె సరిగా కనిపించలేదు.

కొద్దిసేపటికి పుస్తకం మూసింది.

వెంటనే ఆమెవైపు చూశాడు.

'ఈ అమ్మాయి భలే అందంగా ఉంది' అనుకున్నాడు. ఇంట్లోంచి ఎవరో పిలిచినట్లున్నారు. ఉలిక్కిపడినట్లుగా ఆ యువతి లోపలికి వెళ్లింది.

'ఛ... మంచి ఛాన్స్ మిస్సయిందే' అనుకున్నాడు నిట్టూరుస్తూ. అంతే ఆరోజు మొదలుకొని ఆమెను చూడటమే దినచర్యగా మారిపోయింది రవికి.



ఆమెకు దగ్గరవ్వటానికి రోజుకో రకంగా ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆమె చూస్తున్నప్పుడు సెల్‌ఫోన్‌లో స్టైల్‌గా మాట్లాడటం, ఆమె బస్టాండులో ఉన్నప్పుడు బైక్‌తో విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు.

ఆమె ప్రేమ కోసం పడరానిపాట్లు పడటం ప్రారంభించాడు. అనుకోకుండా ఆమె కోసం ఒకరోజు రవి చేసిన పనికి ఆ పిల్ల కాస్త చిరునవ్వులు చిందించింది. దీంతో రవి ఆనందంతో ఆకాశపుటంచులు తాకినట్లయి 'హిప్‌హిప్ హుర్రే' అంటూ గెంతులేశాడు.

ఆమెతో ఎలాగయినా సరే మాట కలపాలనుకున్నాడు. ఓరోజు ఆమెను బస్టాండులో చూశాడు. అక్కడ ప్రయాణీకులెందరో ఉన్నారు. అయినా ధైర్యంచేసి ఆమె దగ్గరకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.

వెంటనే పక్కనున్న ఫ్లవర్ షోరూంకు పరుగుతీసి ఓ చక్కటి గులాబీ పువ్వును ఎంపికచేసి కొన్నాడు. శరవేగంతో ట్రాఫిక్ దాటుకుంటూ ఆమె దగ్గరకు వచ్చాడు రవి. ఆమె రవిని గమనించలేదు.

గుండె వేగంగా కొట్టుకుంటోంది రవికి. జేబులో చెయ్యి పెట్టాడు.

ఆమెకు మరింత దగ్గరగా వచ్చాడు రవి.

ఆమె రవివైపు తిరిగింది. రవిని చూసి నవ్వింది.

రవి జేబులోంచి గులాబీ పువ్వు తీసి ఆమెచేతికి అందిస్తూ "హాయ్... నా పేరు రవి" అని పరిచయం చేసుకున్నాడు.

ఆమె మాట్లాడలేదు.

అంతలో బస్సొచ్చింది.

ఆమె నవ్వుతూనే బస్సెక్కి వెళ్లిపోయింది.

ఆ మాత్రానికే సంతోషంగా రూముకొచ్చాడు. ఆమెకోసం సాయంత్రం బాల్కనీలో చేరి ఎదురు చూడసాగాడు.

ఆమె ఎంతకీ రాలేదు.

"ఏంట్రోయ్... ఈమధ్య తరచూ బాల్కనీలో కూర్చుంటున్నావు? ఏంటి సంగతి?" అని అడిగాడు శ్రీనివాస్.

"అబ్బే ఏంలేదు" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు రవి.

తర్వాతి రోజూ ఆమె కనిపించలేదు.

అసలు వాళ్ళ బాల్కనీ తలుపే తెరుచుకోలేదు.

బస్టాండులో గంటలకొద్దీ వేచి చూశాడు. అయినా లాభం లేకపోయింది.

ఎంత సేపటికీ ఆమె రాలేదు. సాయంత్రం వాళ్ల కాలేజీకి వెళ్లి బయట వేచి చూశాడు.

అక్కడా ఆమె కన్పించలేదు.

దీంతో చివరికి రవి ఆమె ఫ్లాట్‌కి వెళ్లాడు. ఫ్లాట్‌కి తాళం వేసి ఉంది.

దీంతో ఉసూరుమంటూ ఫ్లాట్‌కు వచ్చాడు.

"ఏంట్రా రవీ, రెండు రోజుల నుంచి చూస్తున్నా... ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉంటున్నావు. ఏంటి సంగతి?" అంటూ కళ్ళెగరేసి అడిగాడు శ్రీనివాస్.

"అబ్బే ఏంలేదు" అన్నాడు రవి.

"సర్లే... నీకు ఇష్టం లేకపోతే చెప్పొద్దులే" అంటూ బయటకు వెళ్లిపోయాడు శ్రీనివాస్.

'మాట్లాడదాం అనుకునేలోపే వెళ్లిపోయాడే' అనుకుంటూ ఏదో ఆలోచన వచ్చిన వాడిలా లేచి ఎదురింటి ఫ్లాట్‌కి వెళ్లాడు.

మళ్ళీ తాళమే దర్శనమిచ్చింది. అంతులేని నిరాశతో అలాగే నిలబడిపోయాడు.

ఇదంతా గమనిస్తోన్న పక్క ఫ్లాట్ ఆయన "ఏంటి బాబూ, రోజూ ఇక్కడకి వస్తున్నావు... నిరాశగా వెళుతున్నావు... ఎవరు కావాలి నీకు?" అనడిగాడు దగ్గరగా వచ్చి.

"నేను ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాను. ఈ ఇంట్లో వాళ్లు లోన్ కావాలి అన్నారు. ఆ పని మీద వచ్చాను" అన్నాడు రవి.

"వాళ్లు ఫ్లాట్ ఖాళీ చేసి వెళ్లిపోయారే!" అన్నాడాయన అందుకు బదులుగా.

"ఎక్కడికి వెళ్లారో తెల్సా?" అడిగాడు రవి.

"ఏమో బాబూ... వాళ్లు ఎవరితోనూ మాట్లాడరు. వాళ్ల గురించిన వివరాలు మాకెవరికీ తెలీదు" అన్నాడాయన.

"పోనీ ఎవరిని అడిగితే వివరాలు లభిస్తాయి?" అడిగాడు రవి.

"ఫ్లాట్ అసోసియేషన్ కార్యదర్శిని అడిగితే బహుశా తెలియవచ్చునేమో" అని చెప్పాడాయన.

వెంటనే అసోసియేషన్ కార్యదర్శి ఇంటికి వెళ్లాడు రవి.

"ఆయన పూణే వెళ్ళారు. రావటానికి మూడు రోజులు పడుతుంది" అని ఆ సెక్రటరీ భార్య చెప్పింది.

చేసేదేంలేక తన గదికి వచ్చి కూలబడ్డాడు రవి. నిగ్రహం కోల్పోయి వెక్కి వెక్కి ఏడ్చాడు.

అది చూసిన శ్రీనివాస్ కంగారుపడ్తూ స్నేహితుని భుజం తడ్తూ "ఏమైందిరా?" అన్నాడు.

కళ్ళు తుడుచుకుని జరిగినదంతా చెప్పాడు రవి.

"ఆ అమ్మాయి నీతో మాట్లాడిందా ఎప్పుడైనా?" అని ప్రశ్నించాడు శ్రీనివాస్.

"ఆ... మాట్లాడింది" అన్నాడు.

"ఏంటీ? నిజం చెప్పు" మళ్లీ అడిగాడు శ్రీనివాస్.

"ఏం... ఎందుకు?" అనడిగాడు రవి.

"ముందు చెప్పు" అంటూ రవిని చెట్టించి అడిగాడు శ్రీనివాస్.

దీంతో రవి "... నవ్విందంతే" అన్నాడు.

"సర్లే... అయితే ఇక నీ రోదనలూవేధనలూ కట్టిపెట్టు...ఇప్పటికేమీ మించిపోలేదులే... నీకిదే చెప్తున్నాను, నువ్వా అమ్మాయిని మర్చిపోవటం మంచిది" అన్నాడు శ్రీనివాస్ కనుబొమలు ముడుస్తూ.

గుండె వెయ్యి ముక్కలయినంతగా బాధపడ్డాడు రవి.



"ఎందుకలా అంటున్నావ్? విషయం ఏమిటి?" అడిగాడు రవి.

"ఆ అమ్మాయి మూగది" అన్నాడు శ్రీనివాస్.

రవికి నోట మాట పెగలటం లేదు. శ్రీనివాస్ మాట్లాడుతూనే ఉన్నాడు... అతని పెదాలకదలిక తప్ప ఏమీ వినిపించటం లేదు రవికి. అంతా శూన్యమైనట్లుగా ఉంది.

వారం రోజులపాటు సరిగ్గా ఏమీ తినలేదు.

గడ్డం పెరిగింది. మొహం పీక్కుపోయింది. దిగాలుగా ఉంటున్నాడు. నిద్ర సరిగ్గా పోవటం లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నాడు.

రవిని చూస్తే శ్రీనివాస్‌కి జాలేసింది.

దగ్గరగా వచ్చి రవి తలమీద చెయ్యి పెట్టి ప్రేమగా సవరిస్తూ "పద, మెస్‌కెళ్ళి భోజనం చేసొద్దాం" అన్నాడు.

"పోరా... నాకు ఆకలిగా లేదు" అంటూ విదిలిస్తూ తలెత్తి చూశాడు.

ఆశ్చర్యంగా అలా చూస్తూనే నిలబడ్డాడు. 'కలా! వైష్ణవ మాయా?!' అనుకున్నాడు.

శ్రీనివాస్ ఒకసారి గిల్లి చూపిస్తూ "అవును, నువ్వు చూస్తోంది నిజమే... ఆ అమ్మాయే!" అన్నాడు నవ్వుతూ.

రవి తల దించుకున్నాడు.

"సారీ... అందామె!"

ఈసారి కళ్ళు తేలేశాడు. ఆశ్చర్యంగా ఆమె వైపు అలా చూస్తూండిపోయాడు.

అవును ఆమె మాట్లాడింది. తనను తానే నమ్మలేకపోయాడు.

"మళ్లీ ఇంకోసారి గిల్లనా?!" అన్నాడు శ్రీనివాస్.

రవి సిగ్గుపడ్తూనే "ఏదీ మళ్ళీ మాట్లాడు" అన్నాడు.

"సారీ...ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ... చాలా?!" అంటూ నవ్విందామె.

"ఎందుకు సారీ!" అన్నాడు రవి.

"అసలు విషయం చెబుతున్నాను. శ్రీనివాస్‌తో కలిసి మిమ్మల్ని పరీక్షించాలనుకున్నాను" అందామె.

"ఎందుకు?" అనడిగాడు రవి అమాయకంగా.

"మీది నిజమైన ప్రేమా కాదా అని పరీక్షించటానికి... నేను మూగ అని..." అంటూ గుట్టువిప్పింది ఆమె.

"అంటే ఇలా నిరాహార దీక్ష చేస్తేనే... నిజమైన ప్రేమ అని తేలిందా?!" అన్నాడు రవి బింకంగా.

అది చూసిన శ్రీనివాసూ, ఆ అమ్మాయి కూడా హాయిగా నవ్వేశారు.

రవి కూడా తేలికపడిన మనసుతో వారితో శృతి కలిపి తనివితీరా నవ్వాడు.

అవీ... ఇవీ



పోయిన సంవత్సరంలాగే...ఈ సంవత్సరం కూడా మందు, సిగరెట్స్ మానెయ్యాలని నిర్ణయం తీసుకుంటున్నారా!!



నూతన సంవత్సరం రోజు ఏ కొద్దిమందో అమాయకులు తప్ప...పెద్దగా ఎవరొస్తారయ్యా- గుడికి !!..... దానికి బందోబస్తు దేనికి!!

ఎక్కడున్నా తిరుగు...కానీ, కొత్త సంవత్సరం ఎంటరయ్యే టైంకి మాత్రం 'పూజ' లో కూర్చోవాలందిరా మా ఆవిడ... ఇక వెళ్లనామరి !!

నిన్ను పెళ్లాడే గుడ్‌న్యూస్ కొత్త సంవత్సరం రాగానే చెప్తాడన్నావు... గంటున్నరయ్యింది ఇంకా ఫోన్ రాలేదేం!!

2007 సంబరాలకు మేం 'అభినయశ్రీ' డాన్సు పెట్టాం రండి సార్!!
మేం మెమైత్ ఖాన్, 'అంకిత'ల డాన్సు పెట్టాం ఇటు రండి సార్!!



నూతన సంవత్సర శుభాకాంక్షలు నిన్న రాత్రే చెప్పుండాల్సింది... టూమచ్‌గా తాగి పడుకున్నాడు! రెండ్రోజులకుగాని లేవడు!!



భక్తిమాట దేవుడెరుగు... మా 'దేవదాసు' అయ్యప్పమాల వెయ్యడం వల్ల కొంతకాలమన్నా మందుకి దూరంగా ఉంటాడని నా సంతోషం!

చల్తే... చల్తే

జె.పి. వైద్య

శాస్త్రీయ సంగీతం అర్థం కాకున్నా...!

ఉత్తరభారతదేశంలో "బైరక్‌హోజాయే...!" అని ఆరోజుల్లో ఎవరైనా అంటే... 'వార్నీ! ఇంకెందుకాలస్యం... శుభస్యశీఘ్రం... కానీండి!' అని 'బైరక్'కు ఝుమ్మని తయారైపోయేవాళ్లు...!

ఇంతకూ ఆ 'బైరక్' అంటే ఏమిటంటా? : 'ఆహా! దినమంతా మలమల మాడగొట్టానోచ్... ఇప్పుడింక డ్యూటీ ఆఫ్ అని సూరీడు పడమటికి వాలీవాలకముందే తయ్యారీలు అయిపోయేవి. నీళ్లుచల్లి, రెండు గలీబులూ గ్రా సర్దేసి, పరదాలు ఎత్తేసి, పండువెన్నెల పడేట్టు 'ఇంతెజామ్'లు అయ్యేవి. చుట్టూరా, సిగ్గిలి గాలికి కదలాలా వద్దా అన్న మీమాంసలో పరదాలూ... పరదాల చాటునుంచి మల్లెమొగ్గల సౌరభాలూ... ఖరీదైన పరిమళాలూ... ఒలికిపోయే అత్తరుబుడ్డీలూ... గ్లాసుల గలగలలూ... ఖంగుమని దగ్గి... అంతే నింపాదిగా తబలాపై 'తిర్‌కిట్‌థా...థా...థా...' అని ఓపెనింగ్ మ్యూజిక్ దరువు ఇచ్చే 'తబల్చీ'... మెడనూ, తలనూ లయబద్ధంగా తిప్పుతూ, అంతే నాజూకుగా 'టుంయ్....' మని సారంగీ మీద జారిపోయే స్వరాలను పలికించే సారంగియా మఖమల్ మీద మఖమల్ నడిచే సవ్వడితో కదిలివచ్చే సింగారింపు పదధ్వనుల పూబోణీ...

వంగి అర్ధంగా చేసే 'కుర్నిసాత్'లూ... ముంచేతి మల్లెమొగ్గల బంధాలను తనివితీరా చూసి, పరవశించి

'వాహ్! క్యాబాత్ హై!' అనే గుసగుసలు...! 'పాకీజా'లాంటి ముస్లిం కల్చర్‌లోనూ 'టక్‌రావ్‌జాన్'లాంటి తవాయిఫ్‌ల దునియాలోనూ లెక్కలేనన్ని హిందీ 'ముజరా'ల్లో ఇంతకన్నా బలీయమైన అందమైన జబర్దస్త్ సీన్లు గమనించి ఉండొచ్చు మనం. కానీ తెరవెనక భాగోతాలు... తలనొప్పులు... భిన్నంగా ఉంటాయి. 1966లో ప్రదర్శితమైన 'ఆమ్రపాలి'ని ఆ తరంవాళ్లు సునాయాసంగా మరిచిపోలేదు. వైజయంతీమాలగారి అద్భుతమైన నృత్యలావణ్యాలు పుష్కలంగా దర్శనమిచ్చాయి అందులో.

'మై క్యా కరూ రామ్ ముఝే బుడ్డా మిల్‌గయా..' అంటూ సంగమ్‌లో రాజ్‌కపూర్ ప్యారిస్ అందాలు చూద్దామని ఉవ్విళ్లూరిపోతుంటే... ఆ కలల్ని మొగ్గలోనే తుంచిపారేసి కాళ్లు కట్టి పారేసిన గీతం అది. ఆ రోజుల్లో రసికజనం వెర్రెత్తిపోయారు ఆ పాటకోసం! వైజయంతీమాలగారి సింగారింపుల వీక్షణాలకోసం! ఆమె పటరానీ లోనూ నటించారు. పటరానీలో పదిపాటల్లో తొమ్మిది శైలేంద్ర రాసినవే!

'సాత్‌సముందర్ పార్ హమ్‌రే...' ఒక్కటే హసరత్ జయపురీ రాశారు. 'కభీతో ఆ', 'చంద్రమా మద్‌బరా క్యా ఝూమే..', 'రంగ్‌రంగీలి పగియా బాంధే..' లాంటి గీతాలన్నీ శైలేంద్ర ఆశీర్వాదాలే. నృత్యగీతాల్లో నిపుణురాలైన వైజయంతిమాల కూడా 'స్టెప్స్'లో తడబడసాగింది. 'ఏమిటో! మరి... ఈ పాటా... ! స్టెప్పూ!' అని ముద్దుగా గొణగసాగింది. శంకర్ జైకిషన్‌ల జోడీల్లోని శంకర్‌కు చిర్రెత్తింది. జయపూర్ ఘరానాలోని కృష్ణన్ కుట్టి దగ్గర శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకున్న స్టెప్స్ అప్పుడు పనికొచ్చాయి. వైజయంతిమాల వంటి నృత్యనిపుణురాలు సైతం అబ్బురపడిపోయేట్టు స్టెప్స్‌వేసి 'అర్థమైందా...?!' అన్నట్టు చూశాడు. అది మన హైదరాబాదీ పెహెల్వాన్ శంకర్ దాదా నృత్యం తడాఖా...! తబలా, పఖావజ్‌లో తిరుగులేని నైపుణ్యం ఉండేది ఆయనకు. నృత్యగీతాలన్నా, శాస్త్రీయ సంగీతపు బాణీలన్నా.. జైకిషన్ జారుకుని శంకర్‌వైపు చూసేవాడు. అమరిపోయి, ఇమిడిపోయే సంగీతపు వాద్యాల ఎంపిక, గీతాల్లో బహార్‌దార్ థిరకన్, కళాత్మకమైన తోడీలూ, అందమైన ఘుమావట్‌లూ... శంకర్‌గారి ప్రత్యేకతలు. ప్రతిశబ్దం వెంట అలంకరణలా గజ్జెల నాదాలు కదిలిపోయేవి. ప్రతినాదం వెంట తొట్రుపాటు పడకుండా స్వరాలు సాగిపోయేవి. అందుకే ఆయన గీతాల సృష్టి అజరామరం.

కొన్నింటిని తలచుకుని ఆనందిద్దాం: ఝనక్ ఝనక్ ఘుంఘురవా బాజే' (ఆహ్), 'మన్ భావన్‌కే ఘర్ జాయే గోరీ' (చోరీచోరీ), 'ఛమ్-ఛమ్... సున్‌లో ఛమ్ ఛమ్' (ఉజాలా), 'నాచ్ రే మన్ బత్‌కమ్మా' (రాజ్ కుమార్), 'ఘుంఘరవా మోరాఛమ్ ఛమ్ బాజే (జిందగీ), 'జావోరే జోగి తుమ్ జావోరే' (ఆమ్రపాలి), 'తుమ్హారీ కసమ్ తుమ్ బహుత్ యాద్ ఆయే' (గబన్), 'పాన్‌ఖాయే సైయా హమారో' (తీసరీ కసమ్), 'ఝనక్ ఝనక్ తోరి బాజే పాయలియా' (మేరే హుజూర్)... ఇలా ఎన్నెన్నో!

ఆఖర్న ఓ చిన్న ముచ్చట... 'జావోరే జోగీ' గీతం ముందు రాజ్‌కుమార్‌కోసం తయారుచేశారు అజంతా అనే సినిమా కోసం. అజంతా తెర చూడనేలేదు. రాజ్‌కపూర్‌కు మంచి సంగీతావగాహన ఉండేది. 'రాక్! ఇవ్వనంటే ఇవ్వను' అన్నాడు. రికార్డింగ్ సమయంలో లతామంగేష్కర్ సుతారంగా 'అల్హైయా బిలావల్' రాగాన్ని ఆలపించింది.. దాన్నందుకున్న శంకర్ ఎగిరి గంతేసి 'ధున్' మార్చడమే కాకుండా పూర్తి పాటస్వరూపమే మార్చి 'ఆమ్రపాలి' ప్రొడ్యూసర్ యఫ్.సీ. మెహ్రా చేతిలో పెట్టాడు. 'ఛమ్ ఛమ్ బాజే పాయలియా' గీతాన్ని అడాణా, కాఫీ, చంద్రకౌంస్, జైజవంతి రాగాల్లో కన్నా అద్భుతంగా రూపొందించడమే కాకుండా- పార్శ్వ సంగీతంలో భీమపలాసీ, ధానీ, పట్‌దీప్ రాగాలతో రంగరించి 'రామ్‌సాగర్' అని కొత్త రాగాన్ని సృష్టించాడు. 'భైరవీ'లో రచించిన 'రాజాకే ఆయేగీ బారాత్' (ఆహ్) ను మాలకెంప్‌లో తడిపి ముంచడం ఆయనకే చేతనైంది. అవేవీ చేతకాని, అర్థంకాని మనలాంటి 'కాన్‌సేన్'లం ఏ రాగం పేరూ ఊరూ తెలీకున్నా... 'ఆహాహా! ఓహోహో!' అని అక్కున చేర్చుకున్నాం. ఆత్మీయంగా ఆదరించి పులకించిపోయాం! అసలు రహస్యం చెప్పనా? ఏ కళాకారుడైనా కానీండి.. రసికుల ఆత్మీయాదరణలకే కదా పొంగిపోయేది! ఆనందబాష్పాలు కార్చేదీనూ!!

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
పర్సనాలిటీ
డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ :
9849130141

హిప్నో కమలాకర్

నేను టీచర్‌ను. మావారు బిజినెస్‌మన్. నేను ఏదోరకంగా కొంత సమయాన్ని పిల్లలకు కేటాయిస్తున్నాను. కానీ ఆయనలా చేయడంలేదు. మాతో గడపడానికి సరదా చూపరు. అదే బిజినెస్ పనైతే ఓపిక లేకపోయినా చేస్తారు. ఆయనతో సరదాగా గడపాలంటే ఏం చేయాలి?

- హేమ, కాకినాడ.

ఉద్యోగరీత్యా దూరంగా ఉండడం, అప్ అండ్ డౌన్స్ ప్రయాణాలు, క్యాంపులకెళ్లడం వల్ల ఇలాంటి పరిస్థితి చోటుచేసుకుంటోంది. ఇలా చాలా కుటుంబాల్లో ఉంది. చేస్తున్న ఉద్యోగాన్ని బాధ్యతగా స్వీకరిస్తున్నారు మీవారు. అంకితభావంతో పనిచేస్తున్నారు. అవార్డులను ఎంజాయ్ చేస్తున్నారు. కష్టపడే వయసులో కష్టపడనివ్వండి. తరువాత పిల్లలు, మీరు హాయిగా ఉంటారు. ఆయన చేసేది మీ గురించే. మీమీద ఉన్న ప్రేమవల్లే అంతగా కష్టపడుతున్నారు. మీరు కష్టపడకూడదనేది అతని కోరిక కావచ్చు. రిలాక్సేషన్‌కోసం ఏదైనా ఊరెళ్లడానికి ప్లాన్ చేసుకోండి. సెలవురోజుల్లో గుడికో, మరెక్కడికో వెళ్లండి. ఆయన మళ్లీ వెళ్దామని అడిగేట్లు సరదాగా ఎంజాయ్ చేయండి. కబుర్లతో గడపండి. పిల్లలు, మీరూ దగ్గరగా ఉండాలి. వివాదాస్పదమైన విషయాలు మాట్లాడొద్దు. మీరు ఆయనతో గడపాలని ఉత్సాహపడ్తున్నట్లు మీ ప్రవర్తనద్వారా తెలియజేయాలి. ఆయన పని వీలుచేసుకుంటారు. మీతో గడపడానికి ఇష్టపడతారు. అలా కాకుండా మీలో మీరే బాధపడటం మట్టుకు మీ ఇద్దరికీ మంచిదికాదు. అసంతృప్తికి తావివ్వొద్దు.

నేను ఎనిమిదేళ్లపాటు ఉద్యోగం చేశాను. ఇద్దరు చిన్నపిల్లలు. వాళ్లంటే నాకు చాలా ఇష్టం. వాళ్లను చూసుకోవడం కోసమే జాబ్ మానేశాను. ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలంటే చాలా బోర్‌కొడుతోంది. మళ్లీ ఉద్యోగంలో చేరాలనిపిస్తోంది. పిల్లల్ని చూసుకోవాలనీ ఉంది. ఎటువంటి ఉద్యోగం చేయాలో నిర్ణంచుకోలేకపోతున్నాను.

- మల్లికారావు, అమలాపురం.

ఎవరికైనా ఒకసారి జాబ్‌చేసి మానేసిన తర్వాత మళ్లీ చేయాలనే అనిపిస్తుంది. చిన్నపిల్లలుండి కూడా మీకు ఖాళీ ఎలా దొరికింది? పనులను చక్కగా ప్లాన్డ్‌గా చేసుకుంటున్నారు, వెరీగుడ్. మీలాంటివాళ్లు పార్ట్‌టైమ్ జాబ్ చేయవచ్చు. లేదా సొంతంగాను చేసుకోవచ్చు. పిల్లలతో ముడిపడినటువంటి 'చైల్డ్‌కేర్ సెంటర్' పెట్టుకోవచ్చు. రోలింగ్, టైలరింగ్‌లాంటి పనులు వస్తే, అవి పెట్టుకోవచ్చు. ఎలాంటి పనిని ఎంచుకోవాలి అన్నది మీ మనస్తత్వంపై ఆధారపడి ఉంటుంది.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్లకు మానసికమైన సమ్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ శ్రీ హిప్నోకమలాకర్ తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

ఆడ, మగ బేధాలు లేవని అంటూనే ఉంటారు. పిల్లల్లో తేడాలు చూపుతూనే ఉంటారు. అన్నయ్య, నేను ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాం. నేను బాగా చదువుతున్నాను. అన్నిట్లో నాకే ఫస్ట్. అన్నయ్య ఎలాగో ఈడ్చుకుంటూ వచ్చాడు. ఇప్పటికీ అత్తెసరు మార్కులతోనే పాసవుతాడు. ఆర్థిక పరిస్థితులవల్ల కేవలం ఒక్కర్నే చదివించాలని మా నాన్న నిర్ణయించారు. అదీ అన్నయ్యనే. నన్ను చదివించరట. నేను చదువుకుంటానని ఎంత చెప్పినా నా మాట వినడంలేదు. దయచేసి ఏదైనా మార్గం చెప్పండి.

-గౌరి, విజయనగరం.

నువ్వు ఇప్పుడే సరైన నిర్ణయం తీసుకోవాలి. ఎలా, ఏంచేయాలని ఏడుస్తూ కూర్చోకు. నువ్వు మెరిట్ స్టూడెంట్‌వి. స్కాలర్‌షిప్‌ల ద్వారా చదువుకోవచ్చు. 'చదువుకుంటాను ఆర్థిక సహాయం చేయండి' అని పేపర్లో ప్రకటన ఇవ్వొచ్చు. పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ కరస్పాండెన్స్ కోర్సుద్వారా చదువుకోవచ్చు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. చదువే ధ్యేయంగా ఉండాలి. కాలేజీ యాజమాన్యాన్ని సంప్రదించు. ఉన్న విషయాన్ని చెప్పు. ఒప్పుకునే కాలేజీలు వున్నాయి.

ఆర్. ప్రవీణ్

క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే కిడ్నీమార్పిడి

కిడ్నీ మార్పిడి ఇప్పుడు కొత్త కష్టాలను కొనితేనుంది. కిడ్నీ మార్పిడి క్యాన్సర్ ప్రమాదాన్ని మూడురెట్లు పెంచుతుందని తాజా పరిశోధనల్లో స్పష్టమైంది. అయితే అది ఏ క్యాన్సరైనా కావొచ్చు. వీటన్నింటికీ రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీసే మందుల వాడకమే కారణమని పరిశోధకులు భావిస్తున్నారు. మరోవైపు జనాభా పెరుగుదలకు అనులోమంగానే క్యాన్సర్ కారక వైరస్ వ్యాప్తి కూడా పెరుగుతుందని, ఆ రకంగానూ పరిస్థితి అనారోగ్య వాతావరణానికి దారితీయవచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

ఆస్ట్రేలియాలోని సిడ్నీలోగల యూనివర్సిటీ ఆఫ్ న్యూసౌత్‌వేల్స్‌కు చెందిన క్లెయిరె వాజెడిక్ నాయకత్వంలోని పరిశోధక బృందం దాదాపు రెండేళ్లపాటు ఈ పరిశోధన జరిపింది. ఇందుకోసం కిడ్నీ మార్పిడి చేయించుకున్న 28వేలమందిపై పరీక్షలు జరిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందూ, వెనకా వారిలో క్యాన్సర్ రేటును పరిశీలించారు. మూడు రకాల క్యాన్సర్‌లు ముంచుకొచ్చే ప్రమాదం కిడ్నీ మార్పిడి తర్వాత మూడురెట్లు పెరిగినట్లు గుర్తించారు. నాన్-మెలోనిన్ స్కిన్ క్యాన్సర్, నాన్-హాడ్కిన్ లైంఫోమా మరియు కపోసి సర్కోమా క్యాన్సర్‌లలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంది.

కిడ్నీ మార్పిడి తర్వాత మానవ శరీరంలోని 25 భాగాల్లో క్యాన్సర్ సూచనలు గణనీయంగా పెరిగాయని పరిశోధక బృందం గుర్తించింది. గొంతు, కళ్లు, పురుషాంగం, నాసికారంధ్రాలు వంటి 18 ప్రాంతాల్లో సాధారణ వ్యక్తుల్లోనూ క్యాన్సర్ సోకే ప్రమాదమున్న శరీరభాగాలుగా నిర్ధారించారు.

'రోగ నిరోధక వ్యవస్థ ఆవశ్యకతను ఈ పరిశోధన మరింత నొక్కిచెప్పింది. క్యాన్సర్ నిరోధక వ్యవస్థలో ఇది మరీ కీలకం కూడా. క్యాన్సర్ ఎక్కడెక్కడ సోకుతుందన్న అంశంపై ఇప్పటికే ఉన్న అంచనాలు తాజా పరిశోధనతో తలకిందులయ్యాయి.' అని వాజెడిక్ తెలిపారు. రోగనిరోధకశక్తిపై ప్రభావం చూపే మందులు ట్యూమర్స్ లాంటివాటికి మొదట దారితీస్తాయని ఆయనంటున్నారు.





కొన్ని రకాల క్యాన్సర్లు వైరస్ కారణంగా విజృంభిస్తాయి. ఉదాహరణకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పివి) కారణంగా సర్వికల్ క్యాన్సర్ (మెడ క్యాన్సర్)కు గురవుతాం. ఇది శరీరంలోని కన్ను, అన్నవాహిక తదితర నాలుగు ప్రాంతాల్లో మెడక్యాన్సర్‌కు కీలకంగా భావిస్తున్నారు. క్యాన్సర్‌ను అరికట్టాలంటే హెచ్‌పివి వ్యాక్సిన్‌ను ఆ నాలుగు ప్రాంతాల్లో వాడాల్సిందేనని భావిస్తున్నారు. ల్యుకేమియా వంటి ఇతర క్యాన్సర్ల విషయంలో వైరస్ కానీ, లేదా ఇతర ఇన్‌ఫెక్షన్ కానీ కారణమై ఉంటుందని అంచనా. కిడ్నీమార్పిడి తర్వాత ల్యుకేమియా రేటులో పెరుగుదల ఉందని భావిస్తున్నట్లు వాజ్‌డిక్ చెప్పారు.

మరోవైపు ప్రొస్టేట్, రొమ్ము క్యాన్సర్ల విషయంలో కిడ్నీ మార్పిడి ఎలాంటి ప్రభావాన్నీ చూపలేకపోయిందని గుర్తించారు. ఈ రెండు రకాల క్యాన్సర్ల విషయంలో వైరస్ ప్రభావమేదీ కనబడలేదు. అలాగే మెలొనినా క్యాన్సర్ (చర్మక్యాన్సర్) విషయంలోనూ అంతే. వైరస్ జాడలేవీ కనబడలేదు. ఎలాంటి ఇన్‌ఫెక్షన్‌కూ అవకాశం లేదు. చెమట ఎక్కువగా పట్టడం వల్ల, అంటే ఎండలో ఎక్కువగా తిరగడంవల్ల ఈ క్యాన్సర్ పరిణమిస్తుంది. సౌరశక్తి, శరీరంలోని ఇమ్యూన్‌సిస్టమ్‌పై ప్రభావం చూపడమే దీనికి దారితీస్తుంది.

అలాగని కిడ్నీ మార్పిడికి దూరంగా ఉంటే రోగుల ప్రాణానికే ప్రమాదం. డయాలసిస్ ఖర్చుతో కూడుకుని ఉండటంతోపాటు, ఆ పద్ధతిలో కిడ్నీమార్పిడికన్నా నాలుగురెట్లు ఎక్కువగా ప్రాణాలు పోయే ప్రమాదముంది. 'ఇప్పటికైనా క్యాన్సర్ హెచ్చరికలపట్ల రోగులు జాగ్రత్తగా ఉండాలి. సూచనలు కనిపించగానే తొందరగా స్పందించడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చు' అని పరిశోధకులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వాజెడిక్ బృందం క్యాన్సర్‌కు దారితీయని రోగనిరోధకవ్యవస్థను ప్రభావితం చేసే మందుల తయారీపై దృష్టిపెట్టారు.

కొత్త పుస్తకాలు

మొదటిపేజీ

శ్రీరమణ పేరు వింటూనే ఒక హాసనరేఖ విరుస్తుంది మన పెదాలపైన. చెప్పే విషయం ఎలాంటిదైనా కాస్త సరదాగా చెప్పగలిగే నైపుణ్యం వుండటమే అందుక్కారణం. ఈ మొదటి పేజీ గురించి పుస్తకం చివరిపేజీలో 'ఇందులో నేను విన్నవి, కన్నవి, కథలూ, కబుర్లూ రాశాను. గొప్ప సందేశాలు, ప్రబోధాలేం లేవు..' అని తనే చెప్పుకున్నారు. ఇందులో మొత్తం 126 ఆర్టికల్స్ వున్నాయి. ఇవన్నీ కూడా ఆంధ్రజ్యోతివారి నవ్య పత్రికలో కాలమ్‌గా వచ్చినవే. 'మొదటి పేజీ' శీర్షికలో వచ్చినవన్నీ అచ్చేయక అందులో కొన్నిటిని ఎంపికచేసి, కొన్నిటిని కుదించి ఈ పుస్తకంగా వెలువరించారు.

కథకులు, నవలాకారులకూ లేని సౌకర్యం ఒకటి కాలమిస్టులకు వుంది. అదేమంటే కథలో అయితే కొన్ని విషయాలను మాత్రమే ప్రస్తావించే అవకాశం వుంటుంది. కానీ కాలమ్ అలా కాదు. మన అనుభవంలోకి వచ్చిన ఎన్నెన్నో విషయాలను, మన మనోభావాలు, అనుభవాలు, అనుభూతులు, స్పందనలు, ప్రతిస్పందనలు... ఇలా దేన్నయినా సరే సందర్భానుసారం చెప్పే వీలు వుంటుంది. దీంతో అటు రచయిత తన భావనలన్నిటినీ ఎప్పటికప్పుడు సన్నిహిత మిత్రులకు ఉత్తరాలు రాసినట్లుగా పంచుకునే అవకాశం వుంటుంది. అలాగే పాఠకులు కూడా ఆ రచయిత యాంగిల్లోంచి చూసే అవకాశం దొరుకుతుంది. ఒక అంశాన్ని మామూలుగా చెప్తే జనరంజకంగా వుండదు. దానికే కాస్త హాస్యపు కోటింగిస్తే ఆకట్టుకుంటుంది. ఈ విద్యలో రచయిత గట్టివాడే.

పోతే కథనానికి అతికినట్లుండే, మనసును హత్తుకునేట్లుండే చిన్ని టైటిల్స్ ఎక్కువమంది ఇష్టపడ్డారు. 'ఆ తాత ఎవరో', 'తెలుసు.. తెలుసు', 'షికారి', 'రంగురాయి'... లాంటి పేర్లు షార్ట్ అండ్ స్వీట్‌గా వున్నాయి. ఈ పుస్తకం 'సెలవలోచ్' తో మొదలై 'దీపశిఖ' తో పూర్తయింది. దేనికదే ఆసక్తికరంగా, ఆలోచనాత్మకంగా వున్నాయి.

(నవ్య వీక్లీ మొదటి పేజీ, శ్రీరమణ, వెల: 95, పేజీలు: 184, ప్రచురణ: మోనికా బుక్స్, ప్రతులకు: ఫ్లాట్ నంబర్: 103, రోడ్ నంబర్: 71, నవ నిర్మాణ్ నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033)

- నాగరత్న

మాతృదర్శనం
బెవర్ వీరభద్రరావు
వెల: 20/-, పేజీలు: 67
ప్రతులకు:
సద్ధమ్మ జోతకోబెవర వీరభద్రరావు
సంఘమిత్ర ప్రచురణలు
2-128, మానస విహార్,
పురుషోత్తపురం, పెందుర్తి, విశాఖజిల్లా

గుప్పెడు గింజలు
ఎన్. అరుణ
వెల: 30/-, పేజీలు: 53
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్‌హౌస్,
శ్రీ ఎన్. అరుణ, 13-1/5బి,
శ్రీనివాసపురం, రామంతాపూర్,
హైదరాబాద్.



విప్లవపరివర్తన

కమ్యూనిస్టు విప్లవనిర్మాణ శక్తులను అభివృద్ధి చేయడంలోను, ఉపాధ్యాయరంగంలోను, గిరిజన రైతాంగ ఉద్యమాన్ని విప్లవదృక్పథంలో అభివృద్ధిపరచడంలోను ప్రత్యేక కృషిచేసిన వ్యక్తి కామ్రేడ్ వసంతాడ రామలింగాచారి. ఆయన 24-11-03న చనిపోయారు. కళింగాంధ్రలో పలు కార్మిక ఉద్యమాలకు ఊపిరిపోశారు. అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారు. పాలకులు విప్లవ పరివర్తనకు అంకితమవ్వాలని కొన్ని సూచనలు చేసిన వ్యక్తి ఆచారిగారు.

బ్రిటీషు పరిపాలనా కాలం ఉద్యమాల గురించి ప్రారంభించి- బొల్షివిజం.. ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' నవల అవతరణం, అంబేద్కర్.. భగత్ సింగ్.. గాంధీజీల ఫిలాసఫీలను విశ్లేషించారు. దత్ బ్రాడ్లీథిసిస్- గయకాంగ్రెస్ సందేశం, తెలంగాణా రైతాంగపోరాటం, ఆరోజుల్లో పార్టీవైఖరి, అవగాహనలను వివరించే ప్రయత్నం చేసినట్లు ఈ గ్రంథం చదివితే అర్థమౌతుంది. అధికార మార్పిడి, నయావలస ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థ పరిణామాలు, విశ్లేషణలు చేశారు. పార్టీపరంగా కమ్యూనిస్టు విప్లవశక్తి అవశ్యకత, విప్లవకార్యాచరణ, ఇంకా పలురంగాలపై ప్రచురించిన కరపత్రాలు, కవితలు ఈ గ్రంథంలో దర్శనమిస్తాయి.

గతితార్కిక భౌతిక వాదంపై దృఢంగా నిలదొక్కుకునే ప్రయత్నం చెయ్యాలని, కార్మిక వర్గ దృక్పథమైన మార్క్సిజంపై సాగే దాడులకు ఎదురొడ్డి నిలబడాలని, నిర్ణయాత్మకమైన ప్రజల విప్లవ కార్యాచరణకు పాత్రధారులు కావాలని రామలింగాచారిగారు అభిలషించారు. ఎన్నో కమ్యూనిస్టు ఉద్యమాల పూర్వాపరాలను ఈ గ్రంథం విశ్లేషిస్తుంది. ధర అందుబాటులో ఉంది.

(భారత సామాజిక విప్లవపరివర్తన, కా॥ వసంతాడ రామలింగాచారి, వెల: 25/-, పేజీలు: 232, ప్రతులకు: ఎన్ అప్పలాచారి, శేషాద్రిపురం, వయా పొందూరు, శ్రీకాకుళం జిల్లా ఇంకా అన్ని ప్రముఖ పుస్తకకేంద్రాలు)

- డా॥ మంతెన

పాలకోవా

కావలసిన పదార్థాలు

పాలు - ఒక లీటరు
పంచదార - ముప్పావుకిలో,
యాలకులు - 10

తయారుచేసే పద్ధతి

పాలు సన్నసెగమీద ఉంచి బాగా కలబెడుతూ ఉండాలి. పాలు మీగడ కట్టకూడదు. పేస్టులా అయ్యేవరకూ పాలను మరగపెట్టాలి. మరి కాసేపటికి ముద్దలా అవుతుంది. అందులో పంచదార పొయ్యాలి. ఇప్పుడు కొంచెం పలుచబడుతుంది. మళ్ళీ వేడిచేస్తే గట్టిపడుతుంది. పళ్ళానికి నెయ్యిపట్టించి అందులో ఈ పాకాన్ని పొయ్యాలి. తర్వాత యాలకల పొడి కలపాలి. తర్వాత చిన్న ఉండలుగా చేసుకోవాలి.



చనా లడ్డూ

కావలసిన పదార్థాలు

శనగపిండి - పావుకిలో
పంచదార - 750 గ్రాములు
నెయ్యి - అరకప్పు
కిస్‌మిస్ - 50 గ్రాములు
యాలకులు - 5
జీడిపప్పు - 25 గ్రాములు

తయారుచేసే పద్ధతి

పంచదార మెత్తగా పిండిలా అయ్యేట్టు దంచాలి. కిస్‌మిస్, జీడిపప్పులను వేయించి వుంచుకోవాలి. శనగపిండిని నేతితో వేయించాలి. కొంచెం ఎర్రరంగు వచ్చాక పంచదార,జీడిపప్పు, కిస్‌మిస్, యాలకలపొడి వేసి బాగా కలబెట్టాలి. తర్వాత వుండలు చేసి లడ్డూలుగా చేసుకోవాలి.



దోచుకోలేని ఆస్తి

పి.జ్యోతి

మాతంగపురంలో మాధవుడు, మహేంద్రుడు అనే ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. మాధవుడు సంపన్నుడు. ధనవంతుడిననే అహంకారంతో విర్రవీగేవాడు. ఎంత ఆస్తి వున్నా ఇంకా ఎక్కువ డబ్బు సంపాదించాలనుకునేవాడు.

మహేంద్రుడికి సిరిసంపదలేమీ లేవు. కానీ మంచివాడు. అతని గొంతు వినడానికి చాలా బావుంటుంది. పైగా చక్కగా పాడతాడు కూడా. మహేంద్రుడు మంచి మంచి పాటలు పాడుతూ అందర్నీ అలరించేవాడు. బహుమతిగా వారిచ్చే డబ్బుతో జీవించేవాడు.

మాధవుడికి ఇది నచ్చేది కాదు. ఓసారి మహేంద్రుడితో, "ఇలా పాటలు పాడుతూ కాలక్షేపం చేస్తే ఏమొస్తుంది? ఎన్నాళ్లు గడిచినా అలా వుండి పోవాల్సిందే. బాగా డబ్బు సంపాదించే మార్గం ఏదైనా చూసుకోవచ్చుగా. నేను చూడు... ఎంత దర్జాగా బతుకుతున్నానో!" అన్నాడు దర్పంగా.

దీనికి మహేంద్రుడు, "నా దగ్గర నీలా డబ్బు లేదు. అలాగని... నేను హాయిగా బతకట్లేదని ఎందుకు అనుకుంటున్నావు? నాకున్న కళతో నలుగుర్నీ ఆనందపరుస్తున్నాను. ఆ తృప్తితో సంతోషంగా జీవిస్తున్నాను" అన్నాడు నవ్వుతూ.

మాధవుడు అది విని, "నలుగురూ ఆనందిస్తే నీకు ఒరిగేదేంటో నాకర్థం కావట్లేదు. అయినా డబ్బు విలువ తెలియని నీతో దాని గురించి మాట్లాడ్డం నాదే తప్పు" కోపంగా అని వెళ్లిపోయాడు.

ఓసారి మాధవుడు పని మీద దూరప్రాంతం వెళ్లాడు. తిరిగొచ్చేసరికి ఇంట్లో దొంగలుపడి, డబ్బు, నగలు దోచుకుపోయారు. ఇది తెలిసి మాధవుడు పిచ్చివాడిలా తయారయ్యాడు. అతని బాధ తీర్చడానికి ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ఫలితం లేదు. ఎప్పుడూ పోయిన డబ్బు గురించే ఆలోచిస్తూ తిండి తినడం కూడా మానేశాడు.

మహేంద్రుడికి ఇది తెలిసి మాధవుడి దగ్గరకెళ్లాడు. తన చక్కటి గాత్రంతో అర్థవంతమైన, అద్భుతమైన పాటలు పాడి వినిపించాడు. మాధవుడి బాధ పోగొట్టి, అతని మనసుకు ప్రశాంతతను చేకూర్చాడు.

"మహేంద్రా! అసలైన జీవితం అంటే ఏంటో నాకిప్పుడే తెలిసింది. జీవితం అంటే డబ్బే కాదు. అది మన దగ్గరుంటే ఎవరైనా దోచుకుపోయే ప్రమాదముంది. అదే ఏ కళైనా వుంటే దానిని ఎవరూ దోచుకోలేరు. దూరం చేయలేరు. దాంతో అందర్నీ సంతృప్తిపర్చవచ్చు. అది నీలో ఉంది. అందుకు నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అన్నాడు మాధవుడు.

"నీలో మార్పు వచ్చినందుకు చాలా సంతోషంగా వుంది మాధవా! నువ్వు ఎప్పుడూ ఇలాగే ఆనందంగా జీవించాలని కోరుకుంటున్నాను" అంటూ అక్కడినుండి నవ్వుతూ వెళ్లిపోయాడు మహేంద్రుడు. ★